


భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గం. ఉపాధ్యాయులంటే గౌరవం లేని వైసీపీ నేతలు, కష్టపడి ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను అవమానించేలా ప్రవర్తించడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



గురువారం 24.09.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 154 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# విద్యార్థులకు మానసిక బాసట

## ఒత్తిడి నివారణకు విస్తృత అవగాహన కార్యక్రమాలు

## పాఠశాలల్లో యోగా శిక్షణకు కార్యాచరణ

## పదో తరగతిలో 90 శాతం ఫలితాలే లక్ష్యం

## విద్యాశాఖ, స్కిల్ డెవలప్ మెంట్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి లోకేష్ సమీక్ష



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థుల్లో మానసిక వత్తిడిని నివారించేందుకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో పాఠశాల విద్య, ఉన్నత విద్య, స్కిల్ డెవలప్ మెంట్ అధికారుల మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... మానసిక ఆరోగ్యానికి సంబంధించి అవేర్ నెస్, ఇనిస్టిట్యూషనల్ సపోర్ట్ సిస్టమ్, గైడెన్స్ కోసం ఒక ప్రత్యేక కార్యక్రమాన్ని మిషన్ మోడ్ లో ప్రారంభించాలని అన్నారు. దీనిపై సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరక్టర్ బి.శ్రీనివాసరావు స్పందిస్తూ విద్యార్థుల మెంటల్ హెల్త్ కొరకు కేర్ ఎపి టూల్ ని సిద్ధం చేశామని మరియు పైలట్ కూడా పూర్తి అయ్యిందని చెప్పారు. హార్ట్ ఫుల్ యోగా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా తొలివిడతగా 935 ప్రభుత్వ పాఠశాలల్లో 4.47 లక్షలమంది విద్యార్థులకు యోగా శిక్షణ ఇప్పించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. దీనిపై శ్రీనివాసరావు స్పందిస్తూ... దీనిపై ఇప్పటికే హైదరాబాద్ లోని కన్హా శాంతి వనం అనే సంస్థ ద్వారా 2వేలమంది ఔత్సాహిక ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వబోతున్నామని చెప్పారు. వీరిద్వారా ఈ ఏడాది హైబ్రిడ్ పద్ధతిలో శిక్షణా తరగతులు నిర్వహిస్తామని, వచ్చే ఏడాది నుంచి పూర్తి ఫిజికల్ గా యోగా శిక్షణాతరగతులు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే కుప్పం లోని అగస్త్య సైన్స్ ఫౌండేషన్ లో ఔత్సాహిక సైన్స్ ఉపాధ్యాయులకు జరగనున్న శిక్షణ గురించి తెలియజేశారు.

ఇప్పటివరకు పాఠశాల విద్యలో సంస్కరణలు పూర్తయ్యాయి, ఇక అధికారులంతా ఫలితాలపైనే పూర్తిగా దృష్టిసారించాలని మంత్రి లోకేష్ ఆదేశించారు. టెన్త్, ఇంటర్మీడియట్ లలో 90శాతం ఫలితాల సాధన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అన్నారు. కీ పర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లక్ష్యాలను అధిగమించేందుకు ప్రతి అధికారి చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. యూనివర్సిటీలు, కళాశాలల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుశాతం

మిగతా 2లో...

# రాష్ట్రంలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు



## మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు

- రూ.22,177 కోట్ల పెట్టుబడులకు ఆమోదం
- అమరావతికి రూ.1,548.98 కోట్ల మౌలిక వసతులు
- క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆమోదం
- ఉద్యోగులు, పింఛనర్లకు రెండు విడతల డీఏ
- న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు

**అమరావతి, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్ర పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా గుంటూరు, తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి మౌలిక వసతుల అభివృద్ధి, భారీ పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు, విద్యుత్ ప్రాజెక్టులు, ఉద్యోగులు-పింఛనర్లకు డీఏ, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ల పాలసీ తదితర కీలక ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదముద్ర వేసింది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన బుధవారం సచివాలయంలో జరిగిన 1394వ కేబినెట్ సమావేశంలో 60కిపైగా అంశాలపై నిర్ణయాలు తీసుకున్నారు. సమావేశం అనంతరం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాలు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి నిర్ణయాలను వెల్లడించారు.

మిగతా 8లో...


# వాయుగుండంపై హై అలర్ట్



- సీఎస్, డీజీపీ, మంత్రులతో సీఎం అత్యవసర సమీక్ష
- ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల్లో భారీ వర్షాల హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందే అప్రమత్తం చేయాలి

2 లో

## ఇంద్రకీలాద్రిపై లడ్డూ ప్రసాదం ఏటీఎం



**విజయవాడ, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ఇంద్రకీలాద్రిపై భక్తుల సౌకర్యార్థం మరో ఆధునిక సేవ అందుబాటులోకి వచ్చింది. దుర్గమ్మ ఆలయంలో లడ్డూ ప్రసాదాన్ని త్వరగా పొందేందుకు కొండ దిగువన సెంట్రల్ ఇన్ఫర్మేషన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ప్రసాదం ఏటీఎంను దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆలయ ఛైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనా నాయక్ ప్రారంభించారు.

మిగతా 2లో...

# అమరావతిలో నేత్ర వైద్య విప్లవం






## స్వర్ణాంధ్ర, వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్ ఐఐటీ నిపుణులు

## అమరావతిలో ఎల్వీప్రసాద్ ఐ సంస్థకు సీఎం చంద్రబాబు భూమి పూజ

**అమరావతి, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక సంస్థకు అడుగులు పడ్డాయి. తుళ్లూరు మండలం అబ్బరాజుపాలెం వద్ద ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేశారు. అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించి నిర్మాణ పనులను ప్రారంభించారు. సుధా, వెంకట్ జాస్తి క్యాంపస్ పేరుతో 12 ఎకరాల్లో ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్స్టిట్యూట్‌ను నిర్మించనున్నారు.

మిగతా 2లో...



## వాయుగుండం వేళ.. ఆర్టీసీ, రవాణా శాఖ అప్రమత్తం



- భారీ వర్షాల నేపథ్యంలో ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలి: మంత్రి మండిపల్లి

2 లో

## స్థానిక ఎన్నికల్లో 100 శాతం గెలుపే లక్ష్యం



- ఎన్డీఏ సమన్వయానికి క్షేత్రస్థాయి కార్యాచరణపై కీలక చర్చ

2 లో

## తుపాను ముప్పుతో విద్యుత్ శాఖ అప్రమత్తం


- విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అమరావతి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ శాఖను అప్రమత్తం చేసినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు.

మిగతా 2లో...

## రాయలసీమకు ఉద్యాన రంగం ఊతం



- హార్టికల్చర్ హబ్‌కు అక్టోబరు 2న శ్రీకారం
- రూ.40 వేల కోట్ల కేంద్ర పెట్టుబడి

**అమరావతి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాయలసీమ దశ దిశ మార్చే హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రారంభించనుంది.

మిగతా 2లో...

## అగ్రిగోల్డ్ ప్లాట్లకు పరిష్కారం!

- తొలి విడతలో 35,544 మంది బోనఫైడ్ లబ్ధిదారులకు న్యాయం
- బాండ్ల సేకరణకు 20 ప్రత్యేక బృందాలు
- ఒరిజినల్ చూపించి జిరాక్స్ ఇవ్వాలి: మంత్రి నాదెండ్ల మనోహర్

మిగతా 2లో...

## బీజేపీలో కీలక మార్పులు.. రాష్ట్రాల వారీగా కొత్త ఇన్‌ఛార్జిలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా సంస్థాగత బాధ్యతల్లో మార్పులు చేసింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇన్‌ఛార్జిలు, కో-ఇన్‌ఛార్జిలను నియమించింది. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఈ నియామకాలను ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు డా. అరవింద్ భదౌరియాను ఇన్‌ఛార్జిగా, వానతి శ్రీనివాసన్‌ను కో-ఇన్‌ఛార్జిగా నియమించారు. తెలంగాణ బాధ్యతలను సునీల్ బన్సల్‌కు అప్పగించగా, అభయ్ పాటిల్, రేఖా శర్మలను కో-ఇన్‌ఛార్జిలుగా నియమించారు.

పార్టీ కమ్యూనికేషన్ విభాగంలోనూ మార్పులు చేశారు. అనిల్ బలూనీని కో-ఆర్డినేటర్‌గా,

మిగతా 3లో...

# వైద్యశాఖ హై అలర్ట్... వైద్యులు, సిబ్బంది సెలవులు రద్దు



- భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తం
- జ్వరాలు, విరేచనాల కేసులు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి.
- మందులు, అంబులెన్సుల విషయంలో ముందస్తు చర్యలు చేపట్టాలి
- కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు... నిరంతర పర్యవేక్షణ

**రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. వర్షాలు, వరదల కారణంగా జ్వరాలు, విరేచనాల కేసులు పెరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ప్రజలకు వైద్య సేవలకు ఎలాంటి అంతరాయం లేకుండా వైద్య బృందాలు, మందులు, పరీక్షా పరికరాలు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ మేరకు అధికారులతో చర్చించిన సందర్భంగా బుధవారం ఒక ప్రకటన జారీ చేశారు. అనకాపల్లి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, తిరుపతి, ఏలూరు, పార్వతీపురం మన్యం, ఎస్‌పీఎస్ నెల్లూరు, మార్కాపురం, కాకినాడ, శ్రీకాకుళం జిల్లాలతో పాటు పోలవరం ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. వర్ష ప్రభావిత, వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ప్రతి ప్రభావిత ప్రాంతంలో వైద్యాధికారి, పర్యవేక్షణ సిబ్బంది, ప్రజారోగ్య సిబ్బంది ఉండేలా చూడాలని ఆదేశించారు.

మిగతా 2లో...

# అమరావతిలో నేత్ర వైద్య విప్లవం

(మొదటి పేజీ తరువాయి)

ఏటా సుమారు 3 లక్షల మందికి కంటి వైద్య సేవలు అందించేలా ఆస్పత్రి నిర్మాణం కానుంది. చికిత్సలతో పాటు నేత్ర వైద్య పరిశోధన, శిక్షణ, కమ్యూనిటీ హెల్త్ కార్యక్రమాలపైనా సంస్థ దృష్టి సారించనుంది. ప్రత్యేకంగా ఐ అండ్ బ్రెయిన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. భూమిపూజ అనంతరం బహిరంగ సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి... శరవేగంగా నిర్మితమవుతున్న అమరావతికి ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థ రావడం గర్వకారణమన్నారు. ఇప్పటికే 3 కోట్ల కంటి చికిత్సలు అందించిన సంస్థ అమరావతి నుంచి మరింత విస్తృతంగా సేవలందిస్తుందని తెలిపారు. అమరావతి కేంద్రాన్ని ప్రపంచంలోని అత్యుత్తమ నేత్ర వైద్య పరిశోధన సంస్థగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. కంటి చికిత్సలతో పాటు పరిశోధన, శిక్షణ రంగాల్లోనూ ప్రపంచస్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. పేదలకు కంటి వైద్యం అందించడంలో ఎల్వీ ప్రసాద్ సంస్థ కీలక పాత్ర పోషిస్తోందని సీఎం పేర్కొన్నారు. నాలుగు రాష్ట్రాల్లో 319 కేంద్రాల ద్వారా సేవలు అందిస్తోందన్నారు. డిజిటల్ హెల్త్ ఐ ప్రొఫైల్ ద్వారా ప్రజలకు సకాలంలో చికిత్స అందించేలా సంస్థ పనిచేస్తోందని తెలిపారు. అమరావతిలో ఐ అండ్ బ్రెయిన్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న జీఎన్ రావు, జాస్తి వెంకట్‌లను సీఎం అభినందించారు.

**క్వాంటం కేంద్రంగా అమరావతి :** ఇప్పుడు అమరావతి గురించి దేశం అంతా మాట్లాడుతోందని... మన ప్రజా రాజధానిని ప్రపంచం కూడా గుర్తిస్తోందని సీఎం అన్నారు. నోపోల్ సిటీ, బ్లూ-గ్రీన్ సిటీ, గ్రీన్ ఎనర్జీ, కార్బన్ న్యూట్రల్, డీప్‌టెక్ క్యాపిటల్‌గా అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దడంతో పాటు విస్తృతంగా హరిత ప్రాంతాలను అభివృద్ధి చేసి, గ్రీన్ ఎనర్జీని వినియోగించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఐటీ తర్వాత క్వాంటం కంప్యూటింగ్‌పై దృష్టి సారించామని సీఎం తెలిపారు.





దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం అమరావతిలో ఏర్పాటు అవుతోందన్నారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్అండ్‌టీ సంస్థల భాగస్వామ్యంతో 133 క్యూబిట్ సామర్థ్యం కలిగిన క్వాంటం కంప్యూటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే 21 క్వాంటం స్టార్టప్‌లు అమరావతిలో కార్యకలాపాలు ప్రారంభించేందుకు ముందుకు వచ్చాయని తెలిపారు. ఐదు క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు మూడు క్యూబిట్ కంప్యూటర్లను తయారు చేశాయని పేర్కొన్నారు. అక్టోబరు 3న వివిధ విశ్వవిద్యాలయాల్లో క్వాంటం కంప్యూటర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

**రాజధానిలో రూ.50 వేల కోట్ల పనులు :** అమరావతిలో ప్రస్తుతం సుమారు రూ. 50 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చంద్రబాబు తెలిపారు. ఇన్నర్, ఔటర్ రింగ్‌రోడ్లు, స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటి కీలక మౌలిక వసతులు రానున్నాయని చెప్పారు. విట్, ఎస్ఆర్ఎం, అమృతానందమయి సంస్థలు ఇప్పటికే వచ్చాయని, త్వరలో బిట్స్ పిలానీ క్యాంపస్, ఎక్స్ఎల్ఆర్ఐ వంటి సంస్థలు కూడా రానున్నాయని తెలిపారు. నాలెడ్జ్ ఎకానమీ, పరిశోధన, ఆరోగ్యం, మానవ అభివృద్ధికి కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని సీఎం చెప్పారు. హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌లో భాగంగా బసవతారకం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్, ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వంటి ప్రముఖ సంస్థలు వస్తున్నాయని తెలిపారు. ఏఐ, ల్యాబొరేటరీ ఆటోమేషన్, ఎక్స్‌పెరిమెంటల్ బయాలజీ, క్వాంటం బయో వ్యాలీగా అమరావతి అభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతులను సీఎం మరోసారి అభినందించారు. ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ, రైతుల త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. అమరావతిలో బ్యాంకింగ్ స్ట్రీట్ ద్వారా ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా రాజధాని రూపుదిద్దుకుంటుందని తెలిపారు.

**అక్టోబరు 3న పాన్-ఐఐటీ సదస్సు :** అక్టోబరు 3న విజయవాడలో పాన్-ఐఐటీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు చంద్రబాబు తెలిపారు. దేశంలోని వివిధ ఐఐటీల్లో చదివి ప్రపంచవ్యాప్తంగా స్థిరపడిన నిపుణులు ఈ సదస్సులో పాల్గొని మేధోమథనం చేయనున్నారని చెప్పారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్య సాధనకు పాన్-ఐఐటీ పనిచేస్తోందన్నారు.

భవిష్యత్తులో ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలకు అమరావతి కేంద్రంగా మారుతుందని సీఎం అన్నారు. ప్రపంచ స్థాయి జీవన ప్రమాణాలు, పరిశోధనలకు గమ్య స్థానంగా రాజధాని నిలవాలని ఆకాంక్షించారు. ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ కంటి వైద్యం, పరిశోధన, చికిత్స, శిక్షణలో ప్రపంచ స్థాయి కేంద్రంగా ఎదగాలని కోరారు. సాంకేతికత, అవకాశాలను యువత అందిపుచ్చుకుని ఆకాశమే హద్దుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి పి. నారాయణ, స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్, ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వ్యవస్థాపకులు జి.ఎన్ రావు తదితరులు హాజరయ్యారు.

## వాయుగుండంపై హైఅలర్ట్



**అమరావతి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రానికి తీవ్ర వాయుగుండం ముప్పు పొంచి ఉండటంతో ముఖ్యమంత్రి చంద్రబాబు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. వర్షాల పరిస్థితిపై సీఎస్, డీజీపీ, మంత్రులు, వివిధ శాఖల అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. శ్రీకాకుళం-కవిటి మధ్య వాయుగుండం తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 85 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని అధికారులు సీఎంకు వివరించారు.

ఉత్తరాంధ్ర జిల్లాలు, గోదావరి పరివాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్లు, క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నదులు, వాగులు, వంకల ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షించి లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని సూచించారు.

రిజర్వాయర్లలో నీటి నిల్వలపై అవసరమైన చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సహాయక యంత్రాంగాన్ని సిద్ధంగా ఉంచాలని సీఎం నిర్దేశించారు. 261 మండలాల్లో వర్షాలపై ప్రత్యేక అంచనాలు ఉన్ననేపథ్యంలో నేడు, రేపు కూడా అప్రమత్తత కొనసాగించాలని అధికారులను ఆదేశించారు.

## విద్యార్థులకు మానసిక బాసట



(మొదటి పేజీ తరువాయి)

మెరుగుదలకు ఎఫ్ఆర్ఎస్ ను అమలు చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా మిషన్ మార్చ్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలుచేస్తున్న ఉపాధ్యాయులను, అధికారులను మంత్రి లోకేష్ అభినందించారు. పాఠ్యాంశాల బోధనలో వెనుకబడిన సబ్జెక్టు టీచర్లకు మెంటార్ టీచర్లతో కెపాసిటీ బిల్డింగ్ తప్పనిసరి చేయాలని స్పష్టం చేశారు. అక్షర ఆంధ్ర కార్యక్రమంలో వచ్చే ఏడాది చివరికి నూరుశాతం అక్షరాస్యత సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆశయం, నిర్ణీత లక్ష్యాన్ని సాధించేందుకు అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని మంత్రి లోకేష్ కోరారు.

స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై మంత్రి లోకేష్ సమీక్షిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పిఎం సేతు పథకం ద్వారా పారిశ్రామికవేత్తల సహకారంతో తొలివిడతగా 10పారిశ్రామిక అనుసంధానిత ×× క్లస్టర్లను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఇందుకోసం స్టీల్, రెన్యువబుల్ ఎనర్జీ, ఆక్వా, ఫార్మా సంస్థలతో సంప్రదించి, 90రోజుల కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. స్కిల్ డెవలప్ మెంట్ ఎండి గణేష్ కుమార్ మాట్లాడుతూ... ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 5.43లక్షల మందికి నైపుణ్య శిక్షణ అందించామని తెలిపారు. గత రెండేళ్లుగా జాబ్ మేళాల ద్వారా 1.72లక్షల మంది ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పారు. జాబ్ మేళాల నిర్వహణలో శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని మంత్రి లోకేష్ సూచించారు. ఈ సమావేశంలో మానవవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి జె. శ్యామలరావు, ఉన్నత విద్య డైరక్టర్ నారాయణ భరత్ గుప్తా, ఇంటర్మీడియట్ విద్య డైరక్టర్ రంజిత్ బాషా, పాఠశాల విద్య డైరక్టర్ తమీమ్ అన్సారియా, విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండి దీవెన్ రెడ్డి, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఇన్చార్జి చైర్మన్ విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో 100 శాతం గెలుపే లక్ష్యం

**అమరావతి, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి 100 శాతం గెలుపే లక్ష్యంగా సమష్టి కార్యాచరణతో ముందుకు సాగాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తెలిపారు. విజయవాడలోని ఆయన క్యాంపు కార్యాలయంలో జరిగిన ఎన్డీఏ సమన్వయ సమావేశంలో ఎన్నికల సన్నద్ధత, క్షేత్రస్థాయి పరిస్థితులు, కూటమి పార్టీల మధ్య సమన్వయం, అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.

గ్రామ, మండల స్థాయి నుంచి కూటమి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణకు పదును పెట్టాలని నిర్ణయించినట్లు పల్లా వెల్లడించారు. ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు, చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

టీడీపీ-జనసేన-బీజేపీ భాగస్వామ్య పార్టీల మధ్య సమన్వయాన్ని మరింత పటిష్ఠం చేసుకుని, క్షేత్రస్థాయిలో ఐక్యంగా పనిచేయాలని పల్లా పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి సమన్వయ లోపాలకు తావులేకుండా నాయకులు, కార్యకర్తల మధ్య నిరంతర సమన్వయం కొనసాగిస్తూ కూటమి అభ్యర్థుల విజయమే ధ్యేయంగా ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, తమ్మిరెడ్డి శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## తుపాను ముప్పుతో విద్యుత్ శాఖ అప్రమత్తం

(మొదటి పేజీ తరువాయి)

ఏపీ ట్రాన్స్‌కో, అన్ని డిస్కంలు 24 గంటలూ అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పునరుద్ధరణకు సిబ్బంది, యంత్రాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో తగినంత బొగ్గు నిల్వలు ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలగకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. వాతావరణ పరిస్థితుల ప్రభావంతో 18 హైటెన్షన్ సర్క్యూట్లలో ట్రిప్పింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. 8 ఫీడర్లను పునరుద్ధరించగా, మిగిలిన సర్క్యూట్లలో మరమ్మతులు కొనసాగుతున్నాయని వెల్లడించారు.

ఉత్తర కోస్తా జిల్లాల్లో అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు 266 ప్రత్యేక బృందాల్లో 3,599 మంది సిబ్బందిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు. 30 డివిజన్ కంట్రోల్ రూమ్‌లు, 24 గంటల మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నెల్లూరు, తిరుపతి ప్రాంతాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు, అత్యవసర పరికరాలు, డీ-వాటరింగ్ పంపులు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు.

ప్రతికూల వాతావరణంలో వినియోగదారులు, సిబ్బంది భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సూచించారు. తెగిపడిన విద్యుత్ తీగలు, దెబ్బతిన్న స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, నీట మునిగిన విద్యుత్ పరికరాలకు ప్రజలు దూరంగా ఉండాలని హెచ్చరించారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పర్యవేక్షణ, పునరుద్ధరణ చర్యలు 24 గంటలూ కొనసాగుతాయని తెలిపారు.

## వైద్యశాఖ హై అలర్ట్... వైద్యులు,సిబ్బంది సెలవులు రద్దు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన మందులు, పరీక్షా సామగ్రి తగినంతగా నిల్వ చేసుకోవాలని సూచించారు.

**తాగునీరు.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ :** వర్షాలు, వరదల కారణంగా తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. అవసరమైన చోట క్లోరిన్ మాత్రలు పంపిణీ చేయడంతో పాటు నీటి వనరులకు క్లోరినేషన్ చేయాలని తెలిపారు. ప్రభావిత ప్రాంతాల్లో సురక్షితమైన తాగునీరు, ఆహారం, పాలు అందేలా చూడాలని ఆదేశించారు. సదరు ప్రభుత్వ శాఖలతో కలిసి నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి వెంటనే తొలగించే చర్యలు చేపట్టాలని, ఇళ్లు, పాఠశాలలు, సహాయ శిబిరాలు, బహిరంగ ప్రదేశాల్లో దోమలు పెరగకుండా చూడాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకుని పారిశుద్ధ్య, దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.

**ఆసుపత్రుల్లో జనరేటర్లను సిద్ధం చేయాలి :** విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడే ప్రాంతాల్లోని ఆసుపత్రుల్లో జనరేటర్లు, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని మంత్రి ఆదేశించారు. రహదారులు దెబ్బతిన్నా అత్యవసర వైద్య సేవలు కొనసాగేందుకు కనీసం రెండు అంబులెన్సులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వరదలు, ఇతర ప్రమాదాల నుంచి రక్షించిన వారికి వెంటనే వైద్యం



అందించాలని తెలిపారు.

**గర్భిణిలు, చిన్నారుల పట్ల జాగ్రత్తలు అవసరం :** వారం రోజుల్లో ప్రసవమయ్యే అవకాశం ఉన్న గర్భిణిలను ముందుగానే గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ఐదేళ్లలోపు పిల్లలు, వృద్ధులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ప్రభావిత ప్రాంతాల్లో టీకాలను సురక్షితంగా నిల్వ చేసే ఏర్పాట్లను పరిశీలించాలని తెలిపారు. వరద నీరు తగ్గిన వెంటనే దోమల లార్వా పెరిగే ప్రాంతాలను గుర్తించి నియంత్రణ చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. కాలువలు, నీటి గుంటలు, గుంతలు, నీరు నిలిచే ఇతర ప్రదేశాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. మలేరియా ఎక్కువగా నమోదయ్యే ప్రాంతాలు, తీర ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలు, వరద ప్రభావిత గ్రామాల్లో ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని ఆదేశించారు. అసాధారణంగా కేసులు పెరిగినా, ఒకే ప్రాంతంలో ఎక్కువ కేసులు నమోదైనా, మందులు లేదా సిబ్బంది కొరత ఏర్పడినా సాధారణ నివేదిక కోసం వేచి ఉండకుండా వెంటనే సమాచారం అందించాలని తెలిపారు. తుఫాను సమయంలోనే కాకుండా వర్షాలు, వరదలు తగ్గిన తర్వాత కూడా కొంతకాలం ప్రత్యేక చర్యలు కొనసాగించాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

**వైద్యుల సెలవులు రద్దు.. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు :** తుఫాను పరిస్థితుల నేపథ్యంలో వైద్యులు, సిబ్బంది సెలవుల రద్దు చేసినట్లు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ చక్రధర్‌బాబు మంత్రి సత్యకుమార్ యాదవ్ కు నివేదించారు. అలాగే ఇతర చర్యల గురించి వివరించారు. వైద్యులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. అలాగే పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మంత్రికి చక్రధర్‌బాబు తెలిపారు.

## అగ్రిగోల్డ్ ప్లాట్లకు పరిష్కారం!

**అమరావతి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోందని సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సచివాలయంలో అగ్రిగోల్డ్‌పై రాష్ట్రస్థాయి కమిటీ సమావేశం నిర్వహించి భూములు, ప్లాట్లు, బాధితుల సమస్యలపై సమీక్షించినట్లు చెప్పారు. బాండ్ల సేకరణకు 20 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, బాధితులు ఒరిజినల్ బాండ్లను చూపించి జిరాక్స్ కాపీలను బృందాలకు అందించాలని మంత్రులు కోరారు.




పూర్తి మొత్తాన్ని చెల్లించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్న బోనఫైడ్ ప్లాట్ల లబ్ధిదారులకు తొలి విడతలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రులు తెలిపారు. మొత్తం 42,531 మంది ప్లాట్ల లబ్ధిదారుల్లో 35,544 మందిని బోనఫైడ్ లబ్ధిదారులుగా గుర్తించామని, 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి ఆయా ప్లాట్లను తొలగించేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మరో 6,989 మంది పూర్తి మొత్తం చెల్లించినప్పటికీ రిజిస్ట్రేషన్ జరగలేదని, వారికి రెండో విడతలో పరిష్కారం చూపుతామని తెలిపారు.

అగ్రిగోల్డ్ భూముల్లో గతంలో చేపట్టిన ప్లాంటేషన్లను అటవీ శాఖ ఆధ్వర్యంలో ఆడిట్ చేసి వృక్ష సంపద విలువను లెక్కించనున్నట్లు చెప్పారు. మున్సిపల్ ప్రాంతాల్లోని అగ్రిగోల్డ్ లేఅవుట్ల పరిస్థితిని కూడా సమీక్షిస్తున్నట్లు తెలిపారు. అగ్రిగోల్డ్ వ్యవహారంలో నష్టపోయిన ప్రతి లబ్ధిదారుడికి న్యాయం జరిగేలా మంత్రుల ఉపసంఘం సమావేశాలను వేగవంతం చేసి నిర్ణయాలను అమలు చేస్తామని మంత్రులు స్పష్టం చేశారు.

## రాయలసీమకు ఉద్యాన రంగం ఊతం

(మొదటి పేజీ తరువాయి)

మదనపల్లెలో అక్టోబర్ 2వ తేదీన కేంద్రమంత్రి నిర్మాలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి ఈ ప్రాజెక్టును ప్రారంభిచనున్నారు. కేంద్ర ప్రభుత్వం పూర్వోదయ పథకం కింద రాయలసీమ హార్టికల్చర్ హబ్ ప్రాజెక్టుకు రూ. 40 వేల కోట్లు వివిధ రూపాల్లో ఇవ్వనుంది. వీటికి తోడు మరో రూ. 60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడుల ద్వారా రానున్నాయి. రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ఈ ప్రాజెక్టును అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతర కృషితో, కేంద్రంతో సమన్వయంతో ఈ ప్రాజెక్టును సాధించారు. దీని ద్వారా కరువు పీడిత ప్రాంతాల్లో హార్టికల్చర్ రంగానికి ఊతం ఇచ్చే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసి సాగునీరు అందిస్తున్న ప్రభుత్వం... మరోవైపు హార్టికల్చర్‌ను ప్రోత్సహించడం ద్వారా ఆ ప్రాంతాల్లో సంపద పెరిగేందుకు, రైతులు లబ్ది పొందేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. మదనపల్లెలో జరిగే




ఈ కార్యక్రమంతో పాటు 'ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్'కు కూడా శంకుస్థాపన చేయనున్నారు. వ్యవసాయం రంగంలో అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాటు అయ్యే ఈ అగ్రికల్చర్ స్కూల్‌ను రిలయన్స్ సంస్థ ఏర్పాటు చేస్తోంది.

**సీఎం చంద్రబాబు వరుస కార్యక్రమాలు :** ఈ నెల 29వతేదీ నుంచి 5 రోజుల పాటు సీఎం చంద్రబాబు వరుస కార్యక్రమాలు, పర్యటనల్లో పాల్గొననున్నారు. సెప్టెంబర్ 29వ తేదీన విజయవాడలో ఉదయం ఋషీ కర్మయోగి మిషన్ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం నెల్లూరు జిల్లా ఉదయగిరిలో జరిగే పల్లె పండుగ కార్యక్రమానికి హాజరవుతారు. 30వ తేదీ విజయవాడలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో సీఎం పాల్గొంటారు. 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వనున్నారు. అక్టోబర్ 1వ తేదీ 'పేదల సేవలో' కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారు. 2వ తేదీ మదనపల్లెలో హార్టికల్చర్ హబ్‌కు శంకుస్థాపన తరువాత స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొననున్నారు. 2వ తేదీ గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించే వార్షిక స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం విజయవాడలో పాల్గొంటారు. 3వ తేదీ విజయవాడలో పాన్ ఐఐటీ సదస్సులో సీఎం పాల్గొంటారు.

## వాయుగుండం వేళ.. ఆర్టీసీ, రవాణా శాఖ అప్రమత్తం



**అమరావతి, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** వాయుగుండం ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఉత్తరాంధ్రలో వాయుగుండం ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని మంత్రి ఆదేశించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన వెంటనే స్పందించేలా ఆర్టీసీ, రవాణా సిబ్బంది సిద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో రహదారుల పరిస్థితిని నిరంతరం పరిశీలిస్తూ, అవసరమైన చోట రవాణా భద్రత చర్యలు చేపట్టాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాలు, ఘాట్ రోడ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి తెలిపారు. వర్షాల కారణంగా కొండచరియలు విరిగిపడటం, రహదారులపై నీరు నిలవడం, ఇతర ప్రమాదాలు సంభవించే అవకాశాలున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి అదనపు సిబ్బందితో చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అమరావతి నుంచి వర్షాల పరిస్థితిని, రవాణా వ్యవస్థపై వాటి ప్రభావాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆర్టీసీ, రవాణా శాఖ ఉన్నతాధికారులకు సూచించారు. అవసరమైన సందర్భాల్లో స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుని బస్సుల రాకపోకలు, ప్రయాణికుల భద్రతకు సంబంధించి తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు.

ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వర్ష ప్రభావిత ప్రాంతాల్లో ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

## ఇంద్రకీలాద్రిపై లడ్డూ ప్రసాదం ఏటీఎం



(మొదటి పేజీ తరువాయి)

ప్రసాదం కౌంటర్ల వద్ద రద్దీని తగ్గించి భక్తులు తక్కువ సమయంలో లడ్డూలను పొందేలా ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కమిషనర్ రామచంద్ర మోహన్ తెలిపారు. ఏటీఎం ద్వారా యూపీఐ చెల్లింపులు చేసి లడ్డూ ప్రసాదాన్ని పొందవచ్చని వివరించారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా ఈ సేవను ప్రారంభించామని, ఫలితాలను పరిశీలించిన అనంతరం భక్తుల రద్దీ అధికంగా ఉండే ఇతర ప్రధాన దేవాలయాల్లోనూ ఇటువంటి సదుపాయాలను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు.

దేవాలయ దర్శనాలు, ప్రత్యేక సేవలు, పూజా టికెట్ల పేరుతో భక్తులను మోసం చేసే మధ్యవర్తులు, దళారుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని కమిషనర్ స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తులను నమ్మి టికెట్లు లేదా సేవలు పొందేందుకు ప్రయత్నించవద్దని భక్తులకు సూచించారు. దేవస్థానం అధికారికంగా అందించే వెబ్‌సైట్లు, డిజిటల్ యాప్‌లు, అధీకృత కౌంటర్ల ద్వారానే ఆలయ సేవలను పొందాలని కోరారు.

ఇదిలా ఉండగా, ఇంద్రకీలాద్రిపై జరగనున్న దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల సమయంలో సామాన్య భక్తులకు ప్రాధాన్యం కల్పిస్తూ వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేపడుతున్నట్లు వెల్లడించారు.

# బీజేపీలో కీలక మార్పులు.. రాష్ట్రాల వారీగా కొత్త ఇన్‌ఛార్జిలు

(మొదటి పేజీ తరువాయి)

ఆశిష్ అగర్వాల్‌ను కన్వీనర్‌గా నియమించారు. తాజా నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని పార్టీ ప్రకటించింది.

దిల్లీ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జిగా వినయ్ సహస్రబుద్ధేను నియమించారు. జమ్యాంగ్ త్సెరింగ్ నామ్‌గ్యాల్, దర్శనాబెన్ జర్దోష్ కో-ఇన్‌ఛార్జిలుగా వ్యవహరించనున్నారు. హరియాణా, ఛత్తీస్‌గఢ్ బాధ్యతలను స్మృతి ఇరానీకి అప్పగించారు.

ఉత్తరప్రదేశ్‌కు వినోద్ తావ్డేను ఇన్‌ఛార్జిగా నియమించగా, జగదీష్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ వర్మ, అనంత్ ఓజాలను కో-ఇన్‌ఛార్జిలుగా నియమించారు. బిహార్‌కు హరీష్ ద్వివేది ఇన్‌ఛార్జిగా, సింగీతా యాదవ్, రోహన్ గుప్తా కో-ఇన్‌ఛార్జిలుగా బాధ్యతలు చేపట్టనున్నారు. కర్ణాటక బాధ్యతలను కూడా హరీష్ ద్వివేదికి అప్పగించారు.

తమిళనాడు, ఉత్తరాఖండ్‌కు రామ్ మాధవ్‌ను ఇన్‌ఛార్జిగా నియమించారు. మహారాష్ట్ర బాధ్యతలను బైజయంత్ జై పాండాకు అప్పగించగా, అమిత్ మాలవీయ, సదానంద్ షెట్ తనవాడే, కమల్‌జీత్ సెహ్రావత్ కో-ఇన్‌ఛార్జిలుగా నియమితులయ్యారు. గుజరాత్ బాధ్యతలను తరుణ్ చుగ్‌కు అప్పగించారు.

పంజాబ్, జమ్మూకశ్మీర్‌కు సతీష్ పూనియాను ఇన్‌ఛార్జిగా నియమించారు. 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న పలు రాష్ట్రాలకు సీనియర్ నేతలకు బాధ్యతలు అప్పగిస్తూ పార్టీ సంస్థాగత వ్యవస్థను పునర్వ్యవస్థీకరించింది.

ఒడిశా బీజేపీ ఇన్‌ఛార్జిగా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని నియమించారు. మధ్యప్రదేశ్ బాధ్యతలను త్రిపుర మాజీ ముఖ్యమంత్రి బిప్లవ్ కుమార్ దేబ్‌కు అప్పగించారు. గోవా బాధ్యతలను భారతీ ప్రవీణ్ పవార్‌కు కేటాయించారు.

మొత్తంగా దేశవ్యాప్తంగా 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జిలు, కో-ఇన్‌ఛార్జిల నియామకాలు చేపట్టినట్లు బీజేపీ ప్రకటించింది.

# ఏపీ బీజేపీ ఇంచార్జీల నియామకంపై పీవీఎన్ మాధవ్ హర్షం



**విజయవాడ, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ బీజేపీ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జ్‌గా మధ్యప్రదేశ్‌కు చెందిన డా. అరవింద్ భదోరియా, కో-ఇంచార్జ్‌గా తమిళనాడుకు చెందిన వానతి శ్రీనివాసన్ నియమితులవడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ హర్షం వ్యక్తం చేశారు.

నూతన ఇంచార్జీలకు పీవీఎన్ మాధవ్ శుభాకాంక్షలు తెలిపారు. వారి అనుభవం, మార్గదర్శకత్వంతో ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు.

ఈ నియామకాలు చేపట్టిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌కు పీవీఎన్ మాధవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# బాలల సంక్షేమం, హక్కుల పరిరక్షణపై కమిషన్ పర్యవేక్షణ




- అంగన్‌వాడీ, బాల సదనం, పాఠశాలలు, వసతి గృహాల్లో తనిఖీలు

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ వేటుకూరి ఏ.వి.ఎస్. సూర్యనారాయణ రాజు, సభ్యురాలు కే.జి. పద్మలత గుంటూరు జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రం, బాల సదనం, పాఠశాలలు, వసతి గృహాలను సందర్శించి బాలలకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. పోషకాహారం, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, వసతులపై వివరాలు తెలుసుకున్నారు.

కలెక్టర్ కార్యాలయంలో బాలల సంరక్షణాలయాల సిబ్బందితో సమావేశమై బాలల వసతి, ఆరోగ్యం, విద్య, రక్షణ అంశాలపై చర్చించారు.

అనంతరం మాంటిసోరి హైస్కూల్, ఎస్‌కేబీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను సందర్శించి తాగునీరు, మరుగుదొడ్లు, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, విద్యార్థులకు అందుతున్న ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించారు.

గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించిన కమిషన్ సభ్యులు బాలికలతో మాట్లాడి ఆహారం, వసతి, విద్య, ఆరోగ్య సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ పర్యటనలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ అధికారి పిపిజి ప్రసూన, డీఈఓ డాక్టర్ షేక్ సలీం బాష, జిల్లా బాలల పరిరక్షణాధికారి సి. హెచ్. విజయ్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# టెక్కలి సమీపంలో ఘోర రైలు ప్రమాదం

- నలుగురు ఇంటర్ విద్యార్థులు మృతి.. మరొకరికి గాయాలు

**టెక్కలి, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలోని బర్మా కాలనీ వద్ద రైలు ఢీకొని నలుగురు ఇంటర్ విద్యార్థులు మృతి చెందారు. నౌపడ నుంచి టెక్కలి వైపు రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళ్తున్న ఐదుగురు విద్యార్థులను రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విశాఖరావు, దిలీప్ కుమార్, శివ, శరత్ కుమార్ మృతి చెందగా, సాల్మన్‌రాజ్ గాయపడ్డాడు. అతడిని టెక్కలి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.


ప్రమాద సమాచారం అందుకున్న టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. రైలు రాకను విద్యార్థులు గమనించలేకపోవడంతో ప్రమాదం జరిగినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన సాల్మన్‌రాజ్‌కు మెరుగైన వైద్యం అందించాలని అధికారులు సూచించారు.

**సీఎం చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి :** నలుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఘటనపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్న సీఎం, గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని, బాధిత కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు.

# ‘పీఠ’ధిపతి పదిలమేనా!

- అయోమయంలో భక్తులు శిష్యులు?
- బ్రహ్మయ్య నీ లీలలు ఎక్కడయ్యా?





బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్ ) కాలజ్ఞాన సృష్టికర్త జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి మఠం పీఠాధిపత్యం ఇప్పుడు చిక్కుల్లో పడినట్లే ఉంది.

వివరాల్లోకెళ్తే గత ఏడాది అక్టోబర్ 28 వ తేదీన పీఠాధిపతి ఎంపిక కొరకై శిష్యులతో కలిసి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉండగా అధికారులు దానిని ప్రజాభిప్రాయ సేకరణగా మరల్చి ఓటు బ్యాంకు రాజకీయ వ్యవహారంగా మార్చడం జరిగింది. దాని ముందు రోజు ఆర్ జే సి దేవాదాయ శాఖ పూర్వపు పీఠాధిపతి వారి ధర్మపత్ని కి శిష్యుల జాబితా కొరకై ఫోన్ చేసి వివరణ అడగగా ఆ రికార్డు మహానివేదన మందిరంలో స్వామి రూంలో జాగ్రత్తగా భద్రపరిచి ఉందని తెలియజేసినను అధికారులు దాన్ని కప్పి ఉంచి అప్పటి దేవస్థాన మేనేజర్ ఈశ్వరాచారి ఆర్జెసి దేవాదాయ శాఖ వారికి అసలు మఠానికి శిష్యులే లేరని లేఖ రాసి పంపడం, అది ఇప్పుడు సోషల్ మీడియాలో చాలా వివాదాస్పదమై స్వామి శిష్యులకు చేరడంతో ఇప్పుడు కాస్త వివాదాస్పదంగా మారింది. నిజానికి పూర్వపు మఠాధిపతి దివంగత వీర భోగ వసంత వెంకటేశ్వర స్వామికి దాదాపుగా 2వేల మందికి పైగా శిష్యులు ఉన్నారని సమాచారం. కానీ అసలు శిష్యులే లేరని మేనేజరు దేవాదాయ శాఖ వారికి లేఖ రాయడంపై సర్వత్ర అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో పూర్వపు పీఠాధిపతి శిష్యులని కొందరి వివరణ కోరగా ప్రతి యేటా గురుపూజోత్సవం నాడు మఠాధిపతి ఆదేశానుసారం మఠం ద్వారా శిష్యులకు లేఖ రాసి శిష్యులను రప్పించుకొని గురుపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడమే కాకుండా గురువు ద్వారా కొందరు శిష్యులు గురూపదేశం పొందేవారనీ తెలియచేశారు. అలాంటిది శిష్యులే లేరని మేనేజర్ ఈశ్వరాచారి లేఖ రాసి పంపడంపై ప్రస్తుత తాత్కాలిక మఠాధిపతి మరియు వారి అనుచర వర్గం పదవి కోసం అతనిపై తీవ్ర ఒత్తిడి చేసి మరో రెండు సంవత్సరాలు నీ పదవి పెంచుతామని ఆశ చూపెట్టి ఈ విధంగా లేఖ వ్రాయించారని పలువురు శిష్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్ దేవాదాయ శాఖ వారు ఈ విషయాన్ని పూర్తిగా పరిగణలోకి తీసుకొని సమగ్ర విచారణ జరిపించి శిష్యులతో సమావేశం ఏర్పాటు చేసి ధార్మిక పరిషత్ నియమావళి ప్రకారం శిష్యుల ద్వారానే మఠాధిపతి నియామకం చేపట్టాలని పలువురు భక్తులు శిష్యులు మరియు ఆధ్యాత్మిక వేత్తలు కోరుతున్నారు.

మఠంలో 5వ తరం పీఠాధిపతి భార్య పిచ్చమాంబ వద్ద మొదట ఉపదేశము పొందిన విజయనగరం జిల్లా పార్వతీపురం ఈశ్వరిదేవి పీఠం పీఠాధిపతులు శ్రీనివాసస్వామి అప్పటి మేనేజర్ పెంచలయ్యగారున్న సమయంలో కూడా మఠంలోనే శిష్యుల రిజిస్టర్ ఉండేదని, 1980 సంవత్సరంలోనే శిష్యుల రిజిస్టర్ ఉందని, 1994 లో మొట్టమొదటిసారిగా గురుపూజ మహోత్సవం ప్రారంభమైందని తెలిపారు. అలాగే బళ్లారికి చెందిన ఇద్దరు ప్రముఖ శిష్యులు ఉ బెంగళూరుకు చెందిన ఒక శిష్యుడు మాట్లాడుతూ వారి తాతల నుంచి మఠానికి శిష్యులుగా ఉన్నామని మావద్ద 1990-91 సం.లలో మఠాధిపతి ద్వారా పంపిన లేఖలు కూడా ఉన్నాయని తెలిపారు మాకు ఉపదేశం ఇచ్చి శిష్యులుగా తీసుకునే సమయంలో మేనేజర్ అక్కడే ఉండే వారని మా వద్ద కనీస రుసుము 50 రూపాయలు తీసుకున్నారని అందుకు రసీదు కూడా ఇచ్చారని లెడ్జర్ లో పేరు అడ్రస్ కూడా రాసుకునే వారని తెలిపారు.

అలాంటిది పూర్వపు మేనేజర్ ఈశ్వర చారి అసలు శిష్యుల జాబితానే లేదని డిపార్ట్మెంట్ వారికి లేఖ రాయడంపై శిష్యులు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కొందరి శిష్యుల వివరాలు ఇలా :** గులగాణప్ప అనంతపురం వాస్తవ్యులు వారిని వివరణ కోరగా స్వామివారికి 1550 మందికి పైగా శిష్యులు ఉండే వారిని ప్రతిఏటా స్వామివారికి మేమందరము మఠానికి వచ్చి గురుపూజ మహోత్సవం జరుపుకునే వారమని అలాంటిది శిష్యుల జాబితా లేదని చెప్పడం అట్టి లేఖను డిపార్ట్మెంట్ వారికి పంపించడం చాలా బాధాకరమని తెలిపారు. స్థానిక శిష్యుడు తులసి సత్యనారాయణని వివరణ కోరగా స్వామివారికి 1150 పైచిలుకు శిష్యులు ఉండే వారని మఠాధిపతి ఆదేశానుసారం ప్రతి సంవత్సరం నేనే దగ్గరుండి శిష్యులకు పోస్టు ద్వారా లేఖలు పంపి గురుపూజా మహోత్సవం నాటికి శిష్యులను రప్పించుకొని ఘనంగా గురుపూజ మహోత్సవాన్ని జరుపుకునే వారమని తెలిపారుఎ అలాంటిది శిష్యులు లేరని మఠం మేనేజర్ ఈశ్వర చారి లేఖ రాయడంపై మండిపడ్డారు.

# బేబీ కిట్లకు ఇక ఏటా రూ. 51.15 కోట్ల మంజూరు

- 2.45 లక్షల మంది శిశువులకు ఉపయోగం
- ప్రభుత్వాసుపత్రుల్లో జన్మించే శిశువుల కోసం
- ఒక్కొక్క కిట్టు ధర రూ. 1,400.22
- మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన తల్లుల శిశువులకు ఎన్‌టీఆర్ బేబీ కిట్లు అందించేందుకు ఏటా రూ. 51.15 కోట్ల బడ్జెట్ కేటాయించినట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఏటా సుమారు 2.45 లక్షల ప్రసవాలు జరుగుతున్నాయని, ఒక్కో కిట్ ధర రూ. 1,400.22గా ఉందని చెప్పారు. పుట్టిన తొలి రోజుల్లో శిశువును వెచ్చగా, శుభ్రంగా, సురక్షితంగా ఉంచడంతోపాటు ఇంటికి వెళ్లిన తర్వాత కూడా తగిన సంరక్షణ అందించేందుకు ఈ కిట్లు ఉపయోగపడతాయని తెలిపారు. ఒక్కో కిట్‌లో దోమల నివారణ వలతో కూడిన బేబీ బెడ్, బేబీ మాకింటోష్, శిశువుల దుస్తులు, బేబీ టవల్, ఉతికి మళ్లీ ఉపయోగించుకునే బేబీ న్యాపీలు మూడు, 200 గ్రాముల బేబీ పౌడర్, 100 మి.లీ. బేబీ షాంపూ, 200 మి.లీ. బేబీ ఆయిల్, బేబీ సబ్బు, సబ్బు పెట్టె, రాటిల్ టాయ్, కిట్ బ్యాగ్ ఉంటాయని మంత్రి వివరించారు.

ఎన్‌టీఆర్ బేబీ కిట్లతో శిశువులకు అవసరమైన ప్రాథమిక సంరక్షణ వస్తువులు అందుబాటులోకి వస్తాయని, శిశువుల ఆరోగ్యం, పరిశుభ్రత, భద్రతను కాపాడటంలో ఇవి ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జీవోను బుధవారం వైద్య, ఆరోగ్యశాఖ జారీచేసింది.

# ఉపాధ్యాయులపై దాడిని ఖండించిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్

- దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



**గుంటూరు, సెప్టెంబర్ 22 (జర్నలిస్ట్ ఫైల్) :** విజయవాడలోని శాప్ కార్యాలయం ముందు విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై సోమవారం జరిగిన దాడిని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు తీవ్రంగా ఖండించారు. ఈ ఘటనను నిరసిస్తూ మంగళవారం గుంటూరు నగరంలోని కావటి శంకరరావు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా బొనిగల హైమారావు మాట్లాడుతూ.. ఏదైనా అంశంపై అనుమానాలు, అభ్యంతరాలు ఉంటే చట్టపరమైన మార్గంలో కోర్టులను ఆశ్రయించి నిజానిజాలను నిర్ధారించుకోవాలని సూచించారు. విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం, కార్యాలయాల వద్ద దౌర్జన్యాలకు దిగడం వంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మెగా డీఎస్సీ నియామక ప్రక్రియను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా, పకడ్బందీగా నిర్వహించిందని, ఎలాంటి అనుమానాలకు తావులేకుండా ప్రక్రియను పూర్తి చేసేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. డీఎస్సీపై ఆరోపణలు చేయడం, సమావేశాలు నిర్వహించడం, విధుల్లో ఉన్న ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడటం వల్ల ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతింటున్నాయని అన్నారు.

ఉపాధ్యాయులపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుని, వెంటనే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు రక్షణ కల్పించేలా ప్రత్యేక భద్రతా చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులపై దాడులను సహించబోమని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ సంఘాలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు చేపడతాయని బొనిగల హైమారావు తెలిపారు. కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖలీల్, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ పి. లలిత బాబు, గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్. భాస్కరరావు, రాష్ట్ర కౌన్సిలర్ కూరపాటి రాజా, గుంటూరు వెస్ట్ నగర అధ్యక్షుడు తుమాటి రవి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల్లో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ప్రత్యేక పూజలు

- అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు సేవలు



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని నిర్వాహకులను అభినందించారు.

ముందుగా గుంటూరు శ్రీనివాసరావుపేట 1వ లైన్ మరియు ఆర్ అగ్రహారం 4వ లైన్ ప్రాంతాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. అనంతరం సంపత్ నగర్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహక కమిటీ సభ్యులను అభినందించారు.

అదేవిధంగా గుజ్జనగుండ్ల సెంటర్‌లో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి, వినాయక స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# టెక్కలి రైలు ప్రమాదంపై పీవీఎన్ మాధవ్ సంతాపం

**విజయవాడ, సెప్టెంబర్ 23 (జర్నలిస్ట్ ఫైల్) :** శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో రైలు ఢీకొని నలుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదకరమని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విద్యార్థుల మృతిపై దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని మృతుల కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని పీవీఎన్ మాధవ్ ప్రార్థించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

# టెక్కలి రైలు ప్రమాదంపై మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి



**టెక్కలి, సెప్టెంబర్ 23(జర్నలిస్ట్ ఫైల్) :** టెక్కలి మండలం రావివలస సమీపంలోని బర్మా కాలనీ వద్ద రాజ్యరాణి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొనడంతో నలుగురు ఇంటర్ విద్యార్థులు మృతి చెందడం, మరో విద్యార్థి గాయపడటంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు గంగువాడ విశాఖరావు, జన్ని దిలీప్ కుమార్, జన్ని శరత్ కుమార్, సవర శివగా అధికారులు గుర్తించారు.

మృతుల కుటుంబాలకు మంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన గంగువాడ సల్మాన్ రాజుకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని రెవెన్యూ, పోలీసు, స్థానిక అధికారులను ఆదేశించారు.

రైల్వే ట్రాక్‌ల సమీపంలోని ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలను వేగవంతం చేయాలని ఆదేశించారు.

# కొత్తగా 27 మంది కుబేరులు పుట్టుకొచ్చారు...

**న్యూఢిల్లీ:** దేశంలో అధిక ధరలు సామాన్య ప్రజల ఆదాయాలను హరించుతుంటే మరోవైపు ధనవంతులు మాత్రం కుబేరులుగా మారుతున్నారు. గతేడాదితో పోలిస్తే దేశంలో కొత్తగా 27 మంది డాలర్ బిలియనీర్లు పుట్టుకొచ్చారని ఎం3ఎం హురున్ ఇండియా రిచ్ లిస్ట్ 2026 నివేదిక వెల్లడించింది. దీంతో మొత్తం బిలియనీర్ల సంఖ్య 391కి చేరింది. ఐదేళ్ల క్రితం ఈ సంఖ్య కేవలం 237గా ఉంది. కనీసం రూ. 1,000 కోట్ల సంపద కలిగిన 1,810 మంది వ్యక్తుల వివరాలను ఈ నివేదిక పరిగణలోకి తీసుకుంది. వీరి మొత్తం సంపద గత ఏడాదితో పోలిస్తే 12.8 శాతం పెరిగి రూ.187.5 లక్షల కోట్లకు (సుమారు 1.96 ట్రిలియన్ డాలర్లు) చేరుకుందని తెలిపింది. స్టాక్ మార్కెట్లలో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ వ్యాపార వాటాలు, పారిశ్రామిక రంగాల వృద్ధి ఆధారంగా దేశంలోని అత్యంత సంపన్నుల సంపద పెరిగినట్లు ఈ నివేదిక పేర్కొంది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వ్యక్తుల సగటు సంపద గతంలో రూ. 9,874 కోట్లు ఉండగా.. అది ఇప్పుడు రూ.10,362 కోట్లకు పెరిగింది. జాబితాలోని సంపన్నులు సంయుక్తంగా రోజుకు సగటున రూ.5,833 కోట్ల చొప్పున సంపదను పోగు చేయడం విశేషం.

**రెండో స్థానానికి ముకేష్ అంబానీ.. :** గౌతమ్ అదానీ కుటుంబం రూ.9.23 లక్షల కోట్ల సంపదతో దేశంలోనే అత్యంత సంపన్న కుటుంబంగా అగ్రస్థానంలో ఉంది. గతేడాది అగ్రస్థానంలో ఉన్న ముకేష్ అంబానీ కుటుంబం రూ.8.63 లక్షల కోట్ల సంపదతో రెండో స్థానానికి తగ్గింది. ఈ రెండు కుటుంబాల మధ్య సంపద వ్యత్యాసం రూ.59,400 కోట్లుగా ఉంది. ఎల్‌ఎన్ మిట్టల్ కుటుంబం రూ.3.39 లక్షల కోట్ల సంపదతో మూడో స్థానంలో నిలిచింది. ఏడాదిలో 93 శాతం సంపద పెరగడం మిట్టల్ కుటుంబాన్ని మూడో స్థానానికి చేర్చింది. సైరస్ ఎస్. పూనావాలా రూ.3.03 లక్షల కోట్లతో నాలుగో స్థానంలో, రోషిణి నాడర్ మల్హోత్రా రూ.2.79 లక్షల కోట్లతో ఐదో స్థానంలో ఉన్నారు. రోషిణి నాడర్ దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా కొనసాగుతున్నారు.

### మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు

## హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామిక సంస్థ "ఈక్విక్" భారీ విరాళం

- రూ. 5 లక్షల విలువైన కంప్యూటర్లు, ఆఫీస్ సిబ్బంది ఫర్నిచర్ మరియు స్పోర్ట్‌కిట్ల అందజేత




**దేవరకద్ర, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ డీ.ఎల్.టీ.సీ/ఐ.టీ.ఐ, మహబూబ్‌నగర్‌లో శిక్షణ మరియు పరిపాలనా కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు, విద్యార్థుల వసతుల కల్పనకు అవసరమైన పలు ముఖ్యమైన సామగ్రిని ప్రముఖ పారిశ్రామిక సంస్థ ఈక్విక్ డైస్ & మోల్డ్స్ ఇంజనీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (EQIC DIES MOULDS ENGINEERS PVT. LTD) సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ప్రభుత్వ డీ.ఎల్.టీ.సీ/ఐ.టీ.ఐ ఐఎమ్‌సీ (IMC) చైర్మన్ కావలి శ్రీనివాసులు గారు మరియు ఆ సంస్థ డైరెక్టర్ల బృందం విరాళంగా సమకూర్చారు. హైదరాబాద్‌లోని ఐడీఏ జీడిమెట్ల మరియు పటాన్‌చెరు పశమైలారంలో తయారీ యూనిట్లు కలిగిన ఈక్విక్ సంస్థ తరఫున సుమారు రూ. 5,00,000/- (ఐదు లక్షల రూపాయలు) విలువగల కంప్యూటర్లు, జిరాక్స్ మెషిన్, కంప్యూటర్ టేబుల్స్, విజిటర్ కుర్చీలు, ఆఫీస్ సిబ్బంది ఫర్నిచర్ మరియు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. శ్రీ కావలి శ్రీనివాసులు గారు మరియు సంస్థ డైరెక్టర్ల ప్రత్యేక ఆదేశాల మేరకు ఈ సామగ్రిని ఈక్విక్ సంస్థ హెచ్.ఆర్ బృందం ద్వారా ప్రభుత్వ డీ.ఎల్.టీ.సీ/ఐ.టీ.ఐ, మహబూబ్‌నగర్‌కు పంపించి ప్రత్యక్షంగా అందజేశారు.

ఈ సామగ్రి సంస్థలోని విద్యార్థుల సాంకేతిక శిక్షణా కార్యక్రమాలతో పాటు, వారి క్రీడా వికాసానికి మరియు కార్యాలయ పరిపాలనా పనులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ప్రిన్సిపాల్ పి. మోహన్ బాబు, ట్రైనింగ్ ఆఫీసర్ మరియు ఆఫీస్ సూపరింటెండెంట్ తెలిపారు.ప్రభుత్వ డీ.ఎల్.టీ.సీ/ఐ.టీ.ఐ అభివృద్ధికి, విద్యార్థుల సౌకర్యాల మెరుగుదలకు మరియు పరిశ్రమ-ఐటీఐ అనుసంధానానికి కావలి శ్రీనివాసులు గారు మరియు ఈక్విక్ సంస్థ డైరెక్టర్లు అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని వారు పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఈ భారీ సామగ్రిని స్పాన్సర్ చేసినందుకు శ్రీ కావలి శ్రీనివాసులు గారికి (MD & IMC Chairman), ఈక్విక్ సంస్థ డైరెక్టర్లకు మరియు హెచ్.ఆర్ బృందానికి ప్రిన్సిపాల్, ట్రైనింగ్ ఆఫీసర్,ఆఫీస్ సూపరింటెండెంట్, అధ్యాపక సిబ్బంది మరియు విద్యార్థుల తరఫున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

### జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి

## గణేష్ నిమజ్జనం ఏర్పాట్లపై సూచనలు చేసిన జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్

- పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి
- నేర నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి



**దేవరకద్ర, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** జడ్చర్ల టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారు సందర్శించి పోలీస్ స్టేషన్ పనితీరు, శాంతిభద్రతలు, నేర నియంత్రణ, కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసులు, సిబ్బంది పనితీరును సమీక్షించారు. గతంలో ఇచ్చిన సూచనల అమలు పరిస్థితిని కూడా పరిశీలించారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యత క్రమంలో తీసుకొని దర్యాప్తును వేగవంతం చేయాలని, సాక్ష్యాధారాల సేకరణ, సాక్షుల వాంగ్మూలాలు, నిందితుల గుర్తింపు, చార్జ్‌షీట్ దాఖలు తదితర ప్రక్రియలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఎస్పీ గారు ఆదేశించారు. పిటిషన్లపై కూడా సత్వర విచారణ జరిపి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని సూచించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా పటిష్ట బందోబస్తులి వినాయక నిమజ్జనం సందర్భంగా జడ్చర్ల పట్టణంలో శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిమజ్జన కార్యక్రమం జరిగేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ గారు ఆదేశించారు. నిమజ్జన శోభాయాత్ర రూట్లను ముందుగానే పరిశీలించి, కీలక కూడళ్లలో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అమలు చేయాలని సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుని శోభాయాత్రలు క్రమబద్ధంగా సాగేలా చూడాలని, నిమజ్జన ప్రదేశాల్లో తగిన భద్రతా చర్యలు, లైటింగ్, బారికేడింగ్, క్రేన్ తదితర ఏర్పాట్లను ముందుగానే పరిశీలించాలని ఆదేశించారు. అనుమతి లేని డీజేలు, అధిక శబ్దం, ప్రమాదకరమైన విద్యుత్ వైరింగ్ మరియు నిబంధనలకు విరుద్ధమైన చర్యలకు తావులేకుండా పర్యవేక్షణ చేపట్టాలని స్పష్టం చేశారు. జడ్చర్ల పట్టణ పరిధిలో నేరాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి బీట్ పెట్రోలింగ్, రాత్రి గస్తీ, వాహన తనిఖీలు పెంచాలని ఆదేశించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, అనుమానితుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. మహిళలు, బాలలు, వృద్ధుల ఫిర్యాదులపై సున్నితంగా స్పందించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్పీ గారు సూచించారు. సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించి 1930 హెల్ప్‌లైన్పై ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.ఎస్పీ శ్రీమతి డి.జానకి, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, "ప్రజల భద్రత, నేర నియంత్రణ, బాధితులకు సత్వర న్యాయం అందించడం పోలీసుల ప్రధాన బాధ్యత. ప్రజలకు నమ్మకం కలిగించే విధంగా ప్రతి పోలీస్ అధికారి, సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలి" అని సూచించారు. ఈ సందర్భనలో జడ్చర్ల టౌన్ ఇన్స్పెక్టర్ కమలాకర్ మరియు సిబ్బంది పాల్గొనడం జరిగినది.

### అవార్డులే ఆయనకు ఆభరణాలు స్నేహ బృందమే ఆయన ఆస్తులుభారత్ గురు రత్న

## జాతీయ అవార్డు 2026 గ్రహీత మహమ్మద్ సర్వర్ అహ్మద్ ప్రధానోపాధ్యాయులు..

- ఉద్యోగ విరమణ పొందుతున్న మహమ్మద్ సర్వర్ అహ్మద్ ఉద్యోగ ప్రస్థానం..





**ములుగు, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని పాప్కాపూర్ పాఠశాలలో పేద విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడడంతో పాటు తమ లక్ష్యంగా పెట్టుకున్న ఆ ఉపాధ్యాయుడు ఏటూరు నాగారం ప్రాంతంలో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తమ పాఠశాలను నిర్వహిస్తూ అటు విద్యార్థులు తల్లిదండ్రుల, అధికారుల మన్ననలు పొందినారు. ఏటూరు నాగారం మండలం లోని ప్రాథమిక పాఠశాల పాప్కాపూర్ లో గత 14 సంవత్సరాలుగా పనిచేశారు. గ్రామస్తులు సహకారంతో పాఠశాలకు ఆటస్థలం కోసం రెండు ఎకరాల భూమి సేకరించడం జరిగింది. ఉపాధ్యా యుడు అంకితభావం గమనించిన విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లను ప్రైవేట్ పాఠశాలలకు పంపించమని శబదం చేశారు. ప్రస్తుతం ఏ ఒక్క విద్యార్థి కూడా ఆ గ్రామం నుండి ప్రైవేట్ పాఠశాలకు వెళ్లలేదు. గ్రామంలో కొంతమంది డ్రాప్స్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ నిర్వహించి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం జరిగింది. ఏటూరు నాగారం మండల కేంద్రానికి చెందిన కాకుల మర్రి లక్ష్మణ్ బాబు గారిచే పాఠశాల ఆవరణలో ఒక చేతి బోర్ వేయించడం జరిగింది. అలాగే కెనరా బ్యాంక్ మేనేజర్ తో మాట్లాడి పాఠశాలలో 4 ఫ్యాన్లు పెట్టుకోవడం జరిగింది. గ్రామంలో విద్యా బోధనతో పాటు గిరిజనులను సామాజికంగా గ్రామంలో యువతీ, యువకులు సుమారు 48 మందికి ఓపెన్ టెన్త్ పరీక్షలు వ్రాయించారు. అలాగే గ్రామంలో యువజన సంఘం, మహిళా సంఘాలు ఏర్పాటు చేసి వారికి కుట్టు మిషన్ల శిక్షణ, ఎలక్ట్రిషన్ శిక్షణ ఇప్పించడం జరిగింది. పాఠశాలలోబాలబాలికలకు వేరు వేరు మరుగుదొడ్లు నిర్మించారు. పాఠశాలలో ప్రభుత్వ సామాజిక, స్వచ్ఛభారత్ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఇలాంటి ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని మరికొంతమంది ఉపాధ్యాయులు తమ పాఠశాలను తీర్చిదిద్దాతే బంగారు తెలంగాణ నిర్మించబడు తుందనీ ప్రశంసించడం జరిగింది. సర్వర్ అహ్మద్ ఉపాధ్యాయ వృత్తితో పాటు పర్యావరణ కాపాడడం, గిరిజనుల్లో మూఢన మ్మకాలను నిర్మూలించడం తదితర కార్యక్రమాలు చేపట్టారు. ఉపాధ్యాయ సంఘంలో ప్రాథమిక సభ్యులు నుండి టిఆర్‌టియులో సభ్యత్వం తీసుకొని తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోసం చేపట్టిన అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారు. ములుగు జిల్లా తెలంగాణ టీచర్స్ యూనియన్ అధ్యక్షునిగా నియమితులై సంఘం బాధ్యతలు నిర్వహించారు. కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక కార్యక్రమాలు.జనవరి 2018 తేదీన కలాం ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి వివిధ రంగాలలో ఉత్తములను గుర్తించి వారికి ఘన సన్మానాలు చేయడం జరిగింది. అలాగే ములుగు జిల్లా కేంద్రంలో కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 60 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా సన్మానించడం జరిగింది. లక్ష్మీదేవి పేట గ్రామంలో విద్యావం తులైన పెద్దలకు, యువతి, యువకులకు విజ్ఞానాన్ని పెంపొం దించడానికి తన సొంత గృహంలో గ్రంధాలయాన్ని ఏర్పాటు చేశారు .తెలంగాణ టీచర్స్ యూనియన్ ములుగు జిల్లా అధ్యక్షులు పదవి కాలంలో ఉన్నప్పుడు, ఉపాధ్యాయులకు వారి వారి సమస్యలు పరిష్కారంలో ముందుండి సేవలు అందిస్తూ ఉపాధ్యాయులకు, అధికారులకు మధ్య వారధిగా పనిచేసి వారిచే మన్ననలను పొందారు. సర్వర్ అహ్మద్ కు అవార్డులు రివార్డులు.విద్య, ఇతర రంగాలలో మీ సేవలను గుర్తించి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల ద్వారా పొందిన అవార్డులు. ఒకటి జెడ్ పి హెచ్ ఎస్ రామన్నగూడెం 2012లో పాఠశాల సముదాయ లో ఉత్తమ పాఠశాల, ఉత్తమ ఉపాధ్యాయునిగా గుర్తించి ఘనంగా సన్మానించడం జరిగింది. 2017 సంవత్సరంలో గురుపూ జోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా గుర్తించబడి మండల కేంద్రంలో అవార్డు పొందడం పొందారు.లిలి 2021లో ములుగు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా విశేష సేవలు అందించినకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు పొందారు. వీరి యొక్క విశిష్ట సేవలు గుర్తించి అంబేద్కర్ సంఘం ఏటూరునాగారం వారి ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది . భూపాలపల్లి జిల్లా లో దళిత, గిరిజన టీచర్స్ యూనియన్ మాత సావిత్రిబాయి పూలే జిల్లా అవార్డుతో ఘనంగా సన్మానం పొందారు. బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో షిరిడిలో జరిగిన ఏపీజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు తో సన్మానించారు, తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం వారి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో అవార్డుతో ఘనసన్మానం జరిగింది.తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం సందర్భంగా రూపాయలు 10,116తో ఘన సన్మానం జరిగింది. శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాదు రాష్ట్ర స్థాయి అవార్డు తో ఘనంగా సన్మానించారు. భారత్ గురు రత్న అవార్డు 100% లిటరసీ ఏపీ అండ్ తెలంగాణ హైదరాబాద్ రాష్ట్రంలోని రవీంద్రభారతిలో నేషనల్ అవార్డు సగర్వంగా స్వీకరించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పదవి విరమణ పొందుతున్న ఉత్తమ ఉపాధ్యాయుని గుర్తించి ఇచ్చిన అవార్డును స్వీకరించారు, లిలి తెలంగాణ ప్రభుత్వం ఆల్ మైనార్టీ ఎంప్లాయిస్ హైదరాబాద్ అధికారుల చేతులమీదుగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డుతో ఘనంగా సన్మానించారు.. తేదీ 1:7:20 24 రోజున ఏటూరు నాగారం నుండి వెంకటాపూర్ (రామప్ప)మండలంలోని ప్రాథమిక పాఠశాల నర్సింగాపూర్ కు బదిలీపై రావడం జరిగింది. ప్రధానో పాధ్యాయులుగా బాధ్యతలు స్వీకరించి అట్టి పాఠశాలలో 18 మంది విద్యార్థుల నుండి 34 మంది విద్యార్థుల వరకు పెంచడం జరిగింది. అలాగే గ్రామంలో 100% ఎన్రోల్మెంట్ జరిగింది. విద్యార్థులకు డిజిటల్ టీవీ తో విద్య బోధన జరుగుచున్నది. విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఆరుగురు విద్యార్థులను వివిధ గురుకులాలకు పంపించడం జరిగింది. విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి గాను సోదర ఉపాధ్యాయుడు మాదాసు సుమన్ సహకారంతో పిల్లలకు విద్యాతో పాటు ఆటలు, పాటలు, క్విజ్ స్వయం పరిపాలన దినోత్సవం, పాఠశాల వార్షికోత్సవంతో పాటు విద్యా సంవత్సరంలో వివిధ పండుగల రోజులలో ఆ పండుగలకు చెందిన ప్రత్యేక నేపథ్యాన్ని ప్రతిబింబించే విధంగా కార్యక్రమాలు చేపట్టడం జరిగింది. సర్వర్ అహ్మద్ వివరణ..గత కొన్ని సంవత్సరాలుగా ఏటూరు నాగారం మండలంలోని పాప్కాపూర్ మారుమూల ప్రాంతాలలో ఉపాధ్యాయునిగా, సామాజిక కార్యకర్తగా పనిచేస్తూ క్రమంలో నాకు వచ్చిన అవార్డు, రివార్డుకు లకు సహకరించిన ప్రతి ఒక్కరికి నా యొక్క హృదయపూర్వక నమస్కారములు, ఉపాధ్యాయ వృత్తిలో నాకుసహకరించిన అధికారులకు, ఉపాధ్యాయులకు, ప్రజా ప్రతినిధులకు , గ్రామస్తులకు విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రతి ఒక్కరికి నా యొక్క ధన్యవాదములు.

### నిర్దేశించిన గడువులోపు అన్ని

## గ్రామాల్లో పింఛన్ల పరిశీలన పూర్తి చేయాలి.


- అధికారులను ఆదేశించిన ఎంపీడీఓ శంకర్ నాయక్.
- కల్లెడలో చేయూత సామాజిక భద్రత పింఛన్లను పరిశీలించిన ఎంపీడీఓ.



**పర్వతగిరి, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** చేయూత సామాజిక భద్రతా పింఛన్ల క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను వేగవంతం చేయాలని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం పర్వతగిరి మండలం కల్లెడ గ్రామంలో చేయూత సామాజిక భద్రత పింఛన్లను క్షేత్రస్థాయిలో ఎంపీడీవో మాలోతు శంకర్ నాయక్ పరిశీలించారు. చేయూత పింఛన్ల అర్హుల గుర్తింపు పారదర్శకంగా జరగాలని, అదేవిధంగా పింఛన్ల దరఖాస్తుదారుల ఇంటి వద్దకే వెళ్లి విధిగా పరిశీలన చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, దివ్యాంగుల దరఖాస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు మండలంలోని అన్ని గ్రామాలలో చేయూత సామాజిక భద్రతా పింఛన్ల వెరిఫికేషన్ ప్రక్రియను తప్పక పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కల్లెడ గ్రామ చేయూత పింఛన్ల పరిశీలన అధికారి సూపరింటెండెంట్ విష్ణు మూర్తి, పంచాయతీ కార్యదర్శి బుస్స శ్రీనివాస్, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీటి సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి

- పైపులైన్ల లీకేజీలను వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలి
- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



**దేవరకద్ర, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వెబెక్స్ ద్వారా మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా విభాగాల ఈఈలు, డీఈలు, ఏఈలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితి, పైపులైన్ల నిర్వహణ, లీకేజీలపై అధికారులతో సమీక్షించారు.పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి సరఫరాకు సంబంధించిన పైపులైన్లను అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పరిశీలించాలని సూచించారు. ఎక్కడైనా లీకేజీలు గుర్తిస్తే ఆలస్యం చేయకుండా వెంటనే మరమ్మతులు చేపట్టి నీటి వృథాను అరికట్టాలని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో సమస్యలు తలెత్తుతున్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నిరంతరాయంగా, సక్రమంగా తాగునీరు అందించడమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రతి ప్రాంతంలో నీటి సరఫరా పరిస్థితిని పర్యవేక్షిస్తూ, సమస్యలు ఎదురైతే తక్షణమే స్పందించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

## నిరుద్యోగులు ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సుంకిరెడ్డి



**కల్వకుర్తి, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ, సెప్టెంబర్ నిరుద్యోగ యువత ప్రతి ఉద్యోగ, ఉపాధి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఈఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం తుక్కుగూడలోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీలో నిర్వహించిన జాబ్ డ్రైవ్ ఇంటర్వ్యూ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.20 మంది నిరుద్యోగ యువత హాజరుఈ జాబ్ డ్రైవ్‌కు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి మొత్తం 20 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారు. వెల్దండ మండలం నుంచి 8 మంది, కల్వకుర్తి నుంచి 2 మంది, ఆమనగల్ నుంచి 6 మంది, మాడ్గుల నుంచి 2 మంది, కడ్తాల్ మండలం నుంచి 2 మంది యువత ఇంటర్వ్యూలకు హాజరయ్యారు.ఉపాధి కల్పనే లక్ష్యంఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని, జాబ్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువత అందుబాటులోకి వచ్చే ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా ఇవ్వడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన వెల్లడించారు. అర్హత, నైపుణ్యాలకు అనుగుణంగా లభించే అవకాశాలను యువత సద్వినియోగంచేసుకోవాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర, మహేష్, శ్రీనివాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు చంద్రశేఖర్, ఇంటర్వ్యూలకు హాజరైన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## పతకాలే లక్ష్యంగా పీయూ క్రీడా ప్రణాళికలి

- సౌత్‌జోన్, ఆల్ ఇండియా పోటీల్లో సత్తా చాటాలి
- వీసీ ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్



**దేవరకద్ర, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** క్రీడలు విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని పాలమూరు యూనివర్సిటీ వీసీ ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ అన్నారు. 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాలమూరు యూనివర్సిటీ క్రీడా క్యాలెండర్‌ను మంగళవారం స్పోర్ట్స్ బోర్డు కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. సౌత్‌జోన్, ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పీయూ క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. క్రీడా క్యాలెండర్‌ను పక్కాగా అమలు చేస్తూ ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి, వారికి నాణ్యమైన శిక్షణతో పాటు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ప్రతి క్రీడాంశంలో మెరుగైన ప్రదర్శనతో యూనివర్సిటీకి పతకాలు సాధించేలా క్రీడా, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాలు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని అన్నారు. క్రీడాకారులకు యూనివర్సిటీ అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. స్పోర్ట్స్ బోర్డు సమావేశంలో క్రీడల అభివృద్ధి, క్రీడాకారులకు శిక్షణ, వివిధ పోటీల్లో పాల్గొనడం, మౌలిక సదుపాయాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. యూనివర్సిటీకి మంచి పేరు తీసుకువచ్చేలా క్రీడాకారులను ప్రోత్సహించాలని వీసీ సూచించారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి. రమేష్‌బాబు, ఓఎస్‌డీ టు వీసీ ఆచార్య డి. మధుసూదన్‌రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎన్. చంద్రకిరణ్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ప్రవీణ, ప్రొఫెసర్లు రాజేశ్‌కుమార్, సత్యభాస్కర్‌రెడ్డి, సూపరింటెండెంట్ ఆర్. రవీందర్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ వసంత, డాక్టర్ వెంకట్‌రెడ్డి, డాక్టర్ భగవంతురెడ్డి, యూనివర్సిటీ ఫిజికల్ డైరెక్టర్ వై. శ్రీనివాసులు, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ రజిని, యుగంధర్ పాల్గొన్నారు.

## పీయూ విద్యార్థులకు ఉద్యోగ బాట

- విర్చో పెట్రోకెమికల్ ఆధ్వర్యంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్
- వివిధ కోర్సుల అభ్యర్థులకు ఉద్యోగ అవకాశాలు..

రూ.2.40 లక్షల వరకు వార్షిక CTC



**పాలమూరు, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యార్థులు అందుబాటులోకి వచ్చే ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పాలమూరు యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డా.డి.మధుసూదన్‌రెడ్డి సూచించారు. పాలమూరు యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విర్చో పెట్రోకెమికల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో మంగళవారం అకడమిక్ బ్లాక్ ఆడిటోరియంలో క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కోవాలని సూచించారు. ఒకసారి ఎంపిక కాకపోయినా నిరాశ చెందకుండా మరిన్ని ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించాలని అన్నారు. ఉద్యోగంలో పొందే అనుభవం భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు, అధిక వేతనాలు పొందేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.

**వివిధ కోర్సుల అభ్యర్థులకు అవకాశాలు:**

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఎం.ఎస్సీ కెమిస్ట్రీ, మైక్రోబయాలజీ అభ్యర్థులకు ట్రైనీ కెమిస్ట్, ఎం.టెక్, బీటెక్, బీఎస్సీ, బీఏ, బీకాం అభ్యర్థులకు గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీ, ఐటీఐ, డిప్లొమా అభ్యర్థులకు ప్రొడక్షన్ ట్రైనీ పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. పోస్టులను బట్టి వార్షికంగా రూ.2.16 లక్షల నుంచి రూ.2.40 లక్షల వరకు జుజ అందుబాటులో ఉన్నట్లు నిర్వాహకులు తెలిపారు.కంపెనీ ప్రతినిధులు అభ్యర్థుల విద్యార్హతలు, ధ్రువపత్రాలను పరిశీలించి ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. విద్యార్థులు తమ విద్యార్హతలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలని ప్లేస్‌మెంట్ సెల్ సూచించింది.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. కృష్ణయ్య, ప్లేస్‌మెంట్ అధికారి డా. ఎస్.ఎన్. అర్జున్‌కుమార్, విర్చో పెట్రోకెమికల్ హెడ్--ప్రొడక్షన్ పురుషోత్తం రెడ్డి, హెడ్-బయోటెక్ శ్యామ్‌సుందర్, హెడ్-హెచ్‌ఆర్ సురేష్, కంపెనీ ప్రతినిధులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి వ్యాఖ్యలపై భగ్గుమన్న కాంగ్రెస్ శ్రేణులు

◆ అబద్ధాల ప్రెస్ మీట్లను ప్రజలు తిరస్కరిస్తారు
◆ మేయర్ మహంకాళి స్వామి హెచ్చరిక



**గోదావరిఖని, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రామగుండం నియోజకవర్గ అభివృద్ధిపై ఎలాంటి అవగాహన లేకుండా,కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడమే లక్ష్యంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ప్రెస్ మీట్ పెట్టారని,ఆయన చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం,గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన మీడియా సమావేశంలో నగర మేయర్ మహంకాళి స్వామి, కార్పొరేషన్ అధ్యక్షులు బొంతల రాజేష్ మాట్లాడారు.గతంలో కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా, వెంకటస్వామి ఎంపీగా ఉన్న సమయంలో రామగుండం ప్రాంతంలో నివసిస్తున్న 15,000 మంది పేదలకు వైఎస్సార్ పట్టాలు అందించడమే కాకుండా 600 ఎకరాల భూమిని కేటాయించారని గుర్తుచేశారు.కానీ,తెలంగాణలో బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక జీవోలు 58,59 పేరుతో 6,000 మంది దరఖాస్తు చేసుకుంటే కేవలం 200 నుండి 300 మందికి మాత్రమే పట్టాలిచ్చి,మిగతా వేలాది మందిని మోసం చేశారని మండిపడ్డారు.నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, ఐదేళ్లు కేసీఆర్ మంత్రివర్గంలో శక్తివంతమైన మంత్రిగా పనిచేసిన కొప్పుల ఈశ్వర్ ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగినప్పటికీ సింగరేణి కార్మికుల సంక్షేమాన్ని, మౌలిక వసతులను పూర్తిగా విస్మరించారని ధ్వజమెత్తారు.స్థానిక అభివృద్ధికి ఖర్చు చేయాల్సిన నిధులను గజ్వేల్,సిద్దిపేట ప్రాంతాలకు మళ్లించారని దుయ్యబట్టారు.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో తీవ్ర నీటి ఎద్దడి అనుభవిస్తున్న కార్మికుల కోసం కనీసం ఒక ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ కూడా ఏర్పాటు చేయలేకపోయారని విమర్శించారు. అంతేకాకుండా,సింగరేణిలో కేవలం పేపర్లపైనే బొగ్గు ఉత్పత్తి లెక్కలు చూపిస్తూ,సంస్థను అధఃపాతాళానికి తొక్కిన ఘనత కేసీఆర్,కేటీఆర్,

కవితలదేనని తీవ్రస్థాయిలో ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన స్వల్ప కాలంలోనే స్థానిక ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ సింగరేణి అధికారుల మెడలు వంచి, ప్రభుత్వంతో చర్చించి రూ.105 కోట్ల భారీ నిధులను మంజూరు చేయించారని వెల్లడించారు.కార్మికులకు, నిరుపేదలకు ఇళ్ల స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు అందించేందుకు కలెక్టర్, మున్సిపల్ అధికారులతో కలిసి ప్రైవేట్,సింగరేణి భూముల కేటాయింపుపై నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల,పాఠశాలల ఆధునీకరణకు కోట్లాది రూపాయలు కేటాయించి కార్పొరేట్ స్థాయి విద్యను అందుబాటులోకి తెస్తున్నట్లు పేర్కొన్నారు.గతంలో బిఆర్ఎస్ నాయకులు కాంట్రాక్ట్ వ్యవస్థను రూపుమాపుతామని చెప్పి ఒక్క కాంట్రాక్టు కార్మికుడికి కూడా రూపాయి లాభం చేయలేదని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ అసెంబ్లీలో ప్రత్యేకంగా మాట్లాడి,సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సైతం పర్మనెంట్ కార్మికుల మాదిరిగానే 5,000 రూపాయలు బోనస్ ఇప్పించారని... అంతేకాకుండా దసరా కానుకగా మరో 500 పెంచి మొత్తం 5,500 బోనస్ అందించి కార్మికుల గుండెల్లో నిలిచారని స్పష్టం చేశారు.ఇకనైనా అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే చిల్లర రాజకీయాలు మానుకోకపోతే రామగుండం చైతన్యవంతమైన ప్రజలు బిఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతారని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య,కార్పొరేటర్లు నెల కంటి రాము,వడ్లూరి రవి,బాలసాని తిరుపతి గౌడ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించాలి

- కార్మికులకు 40 శాతం వాటా చెల్లించాలి,
- బీఎంఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య డిమాండ్



**గోదావరిఖని, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** సింగరేణి సంస్థ సాధించిన వాస్తవ లాభాలను తక్షణమే ప్రకటించి, కార్మికులకు లాభాల్లో 40 శాతం వాటాను పంపిణీ చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (బీఎంఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి సత్తయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం,ఆర్జీ-1 పరిధిలోని ఓపెన్ కాస్ట్ 5 ప్రాజెక్ట్ మేనేజర్ అనిల్ గబాలేకు వినతిపత్రం సమర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు.ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడుస్తున్నా లాభాల వివరాలను వెల్లడించకపోవడం కార్మికుల కుటుంబాల్లో అశాంతికి దారితీస్తోందని పేర్కొన్నారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో 58 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి, 62.17 మిలియన్ టన్నుల రవాణా సాధించినందున, వెంటనే లాభాలు ప్రకటించి పర్మనెంట్ కార్మికులకు 40 శాతం వాటా,కాంట్రాక్ట్ కార్మికులకు 10,000 రూపాయల చొప్పున పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.అలాగే,గత రెండేళ్లలో (2023-24లో రూ.2,283 కోట్లు, 2024-25లో రూ.4,034 కోట్లు) లాభాల నుండి కొత్త గనుల అభివృద్ధి పేరుతో తీసిన మొత్తం 6,315 కోట్ల ఆర్థిక వనరులను దేనికి ఖర్చు చేశారో యాజమాన్యం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

అంతేకాకుండా,సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాల కాలపరిమితి ముగిసినందున... కోల్ ఇండియా తరహాలోనే జేబీసీసీఐ సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.సమస్యల పరిష్కారానికి మైన్స్, సేఫ్టీ,వెల్ఫేర్, డైరెక్టర్,సీఎం డీ స్థాయిల్లో నిర్వహించే అన్ని నిర్మాణాత్మక కమిటీలు త్రైపాక్షిక సమావేశాలలో ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.పిట్ కార్యదర్శి పల్లె శ్రీనివాస్ నిర్వహణలో జరిగిన ఈ కార్యక్రమంలో సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆకుల హరిణ్,ఏరియా ఉపాధ్యక్షులు కర్రావుల మహేష్,ఏరియా కార్యదర్శి మేడ రామ్మూర్తి, సహాయ కార్యదర్శి పోరండ్ల వెంకటేశం,నాయకులు ముస్కుల భాస్కర్ రెడ్డి,కాసర్ల వెంకట రమణారెడ్డి,వేముల శ్రీనివాస్, ఆకుల వీరేశం, డి.నరసింగం,బెల్లంకొండ ముత్యంరావు,సల్వాజి మనోహర్రావు తదితరులు పాల్గొన్నారు.

# రీ సర్వే పనులను వేగవంతం చేసి నెలన్నరలోగా పూర్తి చేయాలి

- పట్టా, అసైన్‌మెంట్, అటవీభూముల హద్దుల రికార్డుల ఆధారంగి నిర్ధారించాలి
- భూ రీసర్వే పనులను పరిశీలించిన కలెక్టర్



**భద్రాద్రికొత్తగూడెం సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** భూ రీసర్వే పనులను వేగవంతంచేసి నెలన్నరలోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్-రామవరం, గరీబ్‌పేట, ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, సర్వే పురోగతి, భూహద్దుల నిర్ధారణ, సర్వే నెంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950ఎకరాల భూమికి రీ సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులకు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణ చేపట్టడంతోపాటు అటవీ భూముల హద్దులను కూడా పరిశీలించినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు వివరించారు. సర్వే నెంబర్లు 23,30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు.సర్వే నెంబర్ 20లో పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసి ఉన్నందున ఆయా భూముల హద్దులను రికార్డుల ఆధారంగా స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని, అర్హులైనవారికి ఆర్ఓఎఫ్ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. 420మందికి పైగా పట్టాదారులు ఉన్నారని, ఇందులో గిరిజనులు, ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీసర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై, హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.సమ్మక్క గద్దె సమీపప్రాంతం నుంచి సుమారు 2.3నుంచి 2.5కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు, మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా,వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తంప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూరికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో తహశీల్దర్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖాధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు

- శాంతియుత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించాలి
- నిమజ్జనం పూర్తయ్యే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి: ఎస్పీ రోహిత్‌రాజు

**భద్రాద్రికొత్తగూడెం సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గణేష్ నిమజ్జన కార్యక్రమాలు ప్రశాతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన బందోబస్తు,ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గణేష్ నిమజ్జనకార్యక్రమాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సుమారు వెయ్యిమంది పోలీస్ సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. నిమజ్జన శోభాయాత్రలు జరిగే ప్రధాన మార్గాలు, నిమజ్జన ప్రదేశాలు, రద్దీప్రాంతాలు, సున్నితమైన ప్రాంతాలను ముందుగానే గుర్తించి ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. భద్రాచలం నిమజ్జనం ఘాట్ వద్ద పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేపట్టామన్నారు.



భక్తులు,ప్రజలు అధిక సంఖ్య లో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఘాట్ పరిసరాల్లో పోలీస్ సిబ్బందిని అధిక సంఖ్యలో మోహరించి, రద్దీ నియంత్రణ, వాహనాల రాకపోకలు, పార్కింగ్, శోభాయాత్రల క్రమబద్ధీకరణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అధికారులు నిరంతరం పరిస్థితులను పర్యవేక్షించాలని ఆదేశిం చారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల మళ్లింపు, పార్కింగ్, క్రౌడ్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని సూచించారు. శోభాయాత్రలో డీజేలు, అధిక శబ్దాన్ని కలిగించే సౌండ్ సిస్టమ్స్, టపాసులకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తూ ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యంసేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిమజ్జన ప్రదేశాల్లో గజ ఈతగాళ్లు, రెస్క్యూ సిబ్బంది, అత్యవసర సేవల బృందాలు, రక్షన పరికరాలను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదే శించారు. ప్రమాదకరమైన నీటి ప్రాంతాలను ముందుగానే గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా పోలీస్, అగ్నిమాపక, వైద్య, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖలతో సమన్వయం చేసు కుంటూ అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను సూచించారు.
నిమజ్జన కార్యక్రమం పూర్తయ్యే వరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి విధులు నిర్వహించాలని ఆదేశించారు. శోభాయాత్ర సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పోలీస్‌శాఖకు సహకరించాలని సూచించారు. గణేష్ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేం దుకు జిల్లా ప్రజలు పోలీస్‌శాఖకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# టీబీ ముక్త్ భారత్ లక్ష్య సాధనకు సమన్వయంతో కృషి చేయాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**జగిత్యాల, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** జగిత్యాల జిల్లాను క్షయ వ్యాధి (టీబీ) రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.
ఈ సందర్భంగా జిల్లాలో క్షయ వ్యాధి నియంత్రణకు చేపడుతున్న కార్యక్రమాలు, టీబీ బాధితుల గుర్తింపు, నిర్ధారణ, చికిత్స, పోషకాహార సహాయం, అవగాహన కార్యక్రమాలపై అధికారులు కలెక్టర్‌కు వివరించారు.జిల్లాలో టీబీ లక్షణాలు ఉన్న వ్యక్తులను ముందుగానే గుర్తించి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం అందిస్తున్న చికిత్సను సకాలంలో అందించాలని కలెక్టర్ సూచించారు.టీబీ బాధితుల



చికిత్సను మధ్యలో నిలిపివేయకుండా నిరంతరం కొనసాగించేలా వైద్య సిబ్బంది పర్యవేక్షించాలని ఆదేశించారు.
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు టీబీ వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలు, ఉచిత పరీక్షలు మరియు చికిత్సపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేసి అనుమానిత కేసులను గుర్తించాలని సూచించారు.టీబీ నిర్మూలనకు వైద్య మరియు ఆరోగ్య శాఖతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమం, విద్య, మున్సిపల్ తదితర శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.టీబీ బాధితులకు పోషకాహార సహాయం అందించడం, వారి కుటుంబాలకు అవసరమైన సహకారం కల్పించడం, ప్రజల్లో వ్యాధిపై ఉన్న అపోహలను తొలగించడం ద్వారా "టీబీ ముక్త్ భారత్" లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా స్థాయి కమిటీ సభ్యులు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.సుజాత, జిల్లా టి బి ఆఫీసర్, డా.శ్రీనివాస్, డిఆర్డిఓ రఘువరన్ డిఈవో రాము లేబర్ ఆఫీసర్ సురేందర్ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఫలించిన కోరుట్ల ఎమ్మెల్యే డా. సంజయ్ కృషి

- కోరుట్ల నియోజకవర్గానికి రూ.9.217 కోట్ల విలువైన 12 గోదావరి పుష్కర పనులకు మంజూరు



**జగిత్యాల సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గోదావరి పుష్కరాలు-2027ను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గంలో పుష్కర ఘాట్ల అభివృద్ధి, మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం రూ.9.217 కోట్ల విలువైన 12 పనులకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ప్రతిపాదనల మేరకు ఈ నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.
ప్రభుత్వం జారీ చేసిన జిఓ.ఆర్టీ.నెంబర్ 562 (15-09-2026)లో జగిత్యాల జిల్లా పరిధిలోని 22 నుంచి 33వ సీరియల్ నంబర్లలో కోరుట్ల నియోజకవర్గానికి సంబంధించిన పనులను పొందు పరిచారు.మంజూరైన పనుల్లో ఏర్దండి పుష్కర ఘాట్లకు రూ.3.30 కోట్లు, వాల్గొండకు రూ.2.28 కోట్లు కేటాయించారు. అలాగే కోమటి కొండాపూర్, బార్తిపూర్, వేములకుర్తి, రత్నాలమడుగు, ఫకీర్ కొండాపూర్, వి.వి.రావుపేట, మొగిలిపేట్, ఒబ్బులాపూర్, ఓల్డ్ ధర్మరాజ్‌పల్లి, న్యూ ధర్మరాజ్‌పల్లి ప్రాంతాల్లోని పుష్కర ఘాట్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి.పనులు పూర్తయితే పుష్కరాలకు వచ్చే భక్తులకు ఘాట్ల వద్ద మెరుగైన మౌలిక వసతులు, సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. నిర్ణీత కాలపరిమితిలో పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోనున్నారు.

# వినయ్ భాస్కర్‌రెడ్డిపై దాడి దుర్మార్గం

- దాడులు,అక్రమ కేసులు ప్రభుత్వ పతనానికి నాంది
- వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే,పోలీసుల తీరుపై రేగా ఆగ్రహం



**భద్రాద్రికొత్తగూడెం, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** వరంగల్ ఎంజిఎం ఆసుపత్రి వద్ద మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై జరిగిన దాడి దుర్మార్గమని, ఈదాడిని మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు మంగళవారం ఒకప్రకటనలో తీవ్రంగా ఖండించారు.రోగులను పరామర్శించడంతోపాటు వారికి వైద్యసేవలు ఎలా అందుతున్నాయని పరిశీలించేందుకువెళ్లిన వినయ్ భాస్కర్‌రెడ్డిపై పోలీసులు వ్యవహరించిన తీరు దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ప్రజా సమస్యలను ప్రశ్నిస్తున్న ప్రతిపక్ష నాయకులపై దాడులు, అక్రమకేసులు పెరుగుతున్నాయని విమర్శించారు. దాడులు, అక్రమ కేసులు కాంగ్రెస్ ప్రభుత్వ పతనానికి నాంది అని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని అన్నారు. వినయ్‌భాస్కర్‌రెడ్డిపై జరిగిన ఘటనపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎన్ని అడ్డంకులుఎదురైనా ప్రజాసమస్యలపై పోరాటాలు సాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే ప్రతిపక్షంపై దాడులకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఆరోగ్య సేవలకు సంబంధించిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# క్రీడల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

- ఎంఇఓ మధురవాణి



**కొత్తగూడెం సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** క్రీడల్లో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఇఓ మధురవాణి అన్నారు. 70వ కొత్తగూడెం మండల స్థాయిలో ఆటల పోటీలు, పాఠశాల క్రీడా ఎంపికలు స్థానిక ప్రగతిమైదానంలో మంగళవారం జరిగాయి. ఈకార్యక్రమానికి ఎంఇఓ పాల్గని మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని, ఈక్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలుగచేస్తాయని,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయన్నారు. కావునా ప్రతి పాఠశాలలో ఆటలకుప్రాధాన్యత ఇవ్వాలన్నారు.క్రీడాకారులకు ఎటువంటిగాయాలు కలగకుండా ఫస్ట్ ఎయిడ్‌కిట్‌ను అందుబాటులో ఉంచాలని పిఇటి, పిడిలకు సూచించారు. మండల విద్యాధికారితోపాటు జిహెచ్ఎస్ నేతాజీ రామవరం హెచ్ఎం ద్రౌపతి, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లక్ష్మీ, జిహెచ్ఎస్ రామవరం హెచ్ఎం భరత్, జిహెచ్ఎస్ కూలీలైన్ హెచ్ఎం లాలు, వివిధ పాఠశాలల పిఇటి, పిడిలు పాల్గొన్నారు.

# స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయుడి ఆత్మహత్యాయత్నం

- గొల్లపల్లి మండలంలో కలకలం..
- ఉన్నతాధికారుల ఒత్తిడి, పని భారమే కారణమా..?



**జగిత్యాల సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** గొల్లపల్లి మండలంలోని చిల్వకోడూరులో మంగళవారం నిర్వహించిన స్కూల్ కాంప్లెక్స్ సమావేశంలో ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కలకలం రేపింది. సమావేశం జరుగుతున్న సమయంలో సదరు ఉపాధ్యాయుడు స్లీపింగ్ పిల్స్ తీసుకున్నట్లు సమాచారం.మాత్రలు తీసుకున్న విషయాన్ని గమనించిన తోటి ఉపాధ్యాయులు వెంటనే స్పందించి ఆయనను చికిత్స నిమిత్తం జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. ప్రస్తుతం ఆయనకు చికిత్స అందుతున్నట్లు సమాచారం.ఉన్నతాధికారుల ఒత్తిడి, పని భారంతో తీవ్ర మనస్తాపానికి గురైన కారణంగానే తాను ఈ చర్యకు పాల్పడినట్లు తోటి ఉపాధ్యాయుల వద్ద పేర్కొన్నట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది.
ఈ ఘటనకు అసలు కారణాలు ఏమిటి..? నిజంగానే పని ఒత్తిడి లేదా ఉన్నతాధికారుల వేధింపులు కారణమా..? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. ఘటనపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ చేపట్టి వాస్తవాలను వెల్లడించాలని ఉపాధ్యాయ వర్గాలు కోరుతున్నాయి.

# కాంగ్రెస్ అసమర్థ పాలనతో ఎండిపోయిన గోదావరి

- మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆగ్రహం



**గోదావరిఖని, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** కాంగ్రెస్ ప్రభుత్వ దార్శనికత లేని అసమర్థ పాలన వల్లనే పవిత్ర గోదావరి నది నేడు చుక్క నీరు లేక పూర్తిగా ఎండిపోయిందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నాయకుడు కోరుకంటి చందర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మంగళవారం,గోదావరి నది సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తన పదేళ్ల హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం ద్వారా గోదావరిని ఏడాది పొడవునా సముద్రాన్ని తలపించేలా నిండుకుండలా తీర్చిదిద్దారని అన్నారు.కేసీఆర్ అపర భగీరథుడిలా గోదావరి జలాలను పారించి, నిరంతరం జలకళ ఉట్టిపడేలా చేయడమే కాకుండా లక్షలాది మంది మత్స్యకారుల కుటుంబాలకు శాశ్వత జీవనోపాధిని కల్పించారని కొనియాడారు.అయితే,రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గోదావరి నది జీవకళ కోల్పోయి,ఎడారిలా మారిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ముగిసి నిమజ్జనాలు జరుగుతున్న వేళ,నదిలో నీళ్లు లేకపోవడంతో విగ్రహాలను ఎక్కడ నిమజ్జనం చేయాలో తెలియక భక్తులు తీవ్ర గందరగోళానికి, ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.భక్తుల మనోభావాలను,నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని బిఆర్ఎస్ పార్టీ తరఫున ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నామని... ఎల్లంపల్లి రిజర్వాయర్‌లో నిల్వ ఉన్న నీటిని వెంటనే గోదావరిలోకి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే కన్నెపల్లి పంప్‌హౌస్‌ను తక్షణమే ప్రారంభించి నీటిని పంపింగ్ చేయడం ద్వారా భక్తుల నిమజ్జన ఇబ్బందులను, స్థానిక నీటి సమస్యను పరిష్కరించాలని కోరుకంటి చందర్ ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని స్పష్టంగా డిమాండ్ చేశారు.

# జిల్లా స్థాయి పద్య పోటీల్లో శరణ్యకు ద్వితీయ బహుమతి




**కేశంపేట, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అనుమతితో జ్ఞాన సరస్వతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో, రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్తు సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి పద్యాల పోటీ "పద్య తోరణం"లో పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ కొత్తపేట పాఠశాల విద్యార్థిని ఎం. శరణ్య ప్రతిభ కనబరిచింది. పదో తరగతి విభాగంలో నిర్వహించిన పోటీల్లో శరణ్య ద్వితీయ బహుమతి సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చింది. బహుమతిగా రూ.3,000 నగదు అందుకుంది. ఈ సందర్భంగా విద్యార్థిని శరణ్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు. పద్య పోటీలో ప్రతిభ కనబరిచి బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుతో పాటు సాహిత్య, సాంస్కృతిక రంగాల్లోనూ పాల్గొని తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావాలని ఉపాధ్యాయులు సూచించారు. శరణ్య భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## కమనీయం చిన్నారి అక్షయ నృత్యం

- సినీ నటుడు సుమన్ అభినందనలు



**షాద్‌నగర్, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** సాంప్రదాయ అలంకరణలో చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం కన్నుల పండుగగా ఉందని సినీ నటుడు సుమన్ అన్నారు. సోమవారం చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో అభినందన సంస్కృత సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి ఉత్సవాలలో భాగంగా 'అభినందన అక్కినేని పురస్కారని ఎంపికై కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలను తిలకించి వారిని అభినందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆధునిక సమాజంలోనూ మన సాంప్రదాయ కళలపై మక్కువ పెంచుకుంటూ చిన్నారులు కూచిపూడి నృత్యాన్ని అభ్యసించడం అభినందనీయమన్నారు.షాద్‌నగర్ పట్టణానికి చెందిన నాట్య నివేదాలయం కూచిపూడి గురువు భార్గవి శిష్య బృందం ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో విద్యార్థులు తేజశ్రీ, నందిత, శ్రీయుక్త, ప్రణవి, ఆద్యశ్రీ, కాత్యాయిని, ఆరాధ్యతో పాటు వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వరి పంటపై చీడపీడల దాడి.. రైతులు అప్రమత్తంగా ఉండాలి

- క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించిన వ్యవసాయ అధికారి విజయచంద్ర



**షాబాద్, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** వరి పంటలో చీడ పీడలు, తెగుళ్లను తొలిదశ లోనే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి దండెం విజయచంద్ర రైతులకు సూచించారు. కుమ్మరిగూడ గ్రామంలో రైతులు అంజయ్య, హరికృష్ణ, క్రిష్టయ్య సాగు చేస్తున్న వరి పొలాలను ఆయన సందర్శించి పంట పరిస్థితిని పరిశీలించారు. కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగు, గోధుమరంగు దోమ, అగ్గితెగులు, బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులు వంటి సమస్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

**రైతులకు ముఖ్య హెచ్చరిక**

అవసరం లేకుండా పురుగుమందులు పిచికారీ చేయవద్దు. పొలాన్ని క్రమం తప్పకుండా పరిశీలించి, పురుగు ఉధృతి ఆర్థిక నష్టస్థాయిని దాటినప్పుడు మాత్రమే వ్యవసాయ శాఖ సిఫార్సుల మేరకు మందులు వినియోగించాలని విజయచంద్ర సూచించారు. అధిక నత్రజని ఎరువుల వాడకాన్ని నివారించి, సరైన నీటి యాజమాన్యం పాటించాలని తెలిపారు.మందుల వివరాలు: కాండం తొలిచే పురుగు, ఆకుముడత పురుగులకు ఫ్లుబెండియామైడ్/కార్టాప్ హైడ్రోక్లోరైడ్; గోధుమరంగు దోమకు బుప్రోఫెజిన్; అగ్గితెగులుకు ట్రైసైక్లోజోల్/ఐసోప్రోథియోలేన్/అజోక్సిస్ట్రోబిన్; బ్యాక్టీరియా ఆకు ఎండుతెగులుకు కాపర్ హైడ్రాక్సైడ్‌ను సిఫార్సు చేశారు.సమతుల్య ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కలుపు నివారణతో పంట ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు.

# పచ్చని ప్రాంగణ మే ప్రగతికి ప్రతీక - పాఠశాలలో మొక్కలు నాటిన తహసీల్దార్.

**ఏన్కూర్, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారం పాఠశాల ప్రాంగణంలో పర్యావరణ పరిరక్షణ,పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల తహసీల్దార్ సిహెచ్ శేషగిరి రావు ముఖ్యఅతిథిగా హాజరై మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ సిహెచ్. శేషగిరి రావు మాట్లాడుతూ.... పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, విద్యార్థి దశ నుంచే మొక్కల సంరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని క్రమం తప్పకుండా సంరక్షించినప్పుడే కార్యక్రమానికి సార్థకత చేకూరుతుందని అన్నారు.పచ్చని చెట్లు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి. నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై బాధ్యతను పెంపొందించేందుకు పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు.నాటిన ప్రతి మొక్కను విద్యార్థులు దత్తత తీసుకుని సంరక్షించేలా చర్యలు చేపట్టాలన్నారు. డిప్యూటీ వార్డెన్ డిఎస్. నాగేశ్వరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి విద్యార్థి కనీసం ఒక మొక్కను నాటి దానిని సొంత మొక్కగా భావించి సంరక్షించాలని సూచించారు. నేడు నాటే ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సంపదగా మారుతుందని తెలిపారు.పాఠశాల ప్రాంగణంలో వివిధ రకాల మొక్కలు నాటారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు మొక్కలను సంరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు.ఒక్క మొక్క నాటడం కాదు ఒక తరానికి ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడం మా కర్తవ్యం అని ప్రతినపూనారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఎం. చంద్రరావు,బి.రవి,బి.





సింగ్యా, బి.శోభన్ నాయక్,పాయం శ్రీనివాస్, వి.రమేష్,డి. వెంకటరమణ, బి.శారదాబాయి, డి.ఉషశ్రీ, బి.కపూర్య, కళ్యాణి,పద్మ,పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక మండపాల్లో మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు







**నేరేడ్‌మెట్, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మంగళవారం మల్కాజిగిరి డివిజన్ పరిధిలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు పూజలు నిర్వహించి, ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండపాల నిర్వాహకులు, స్థానిక నాయకులు, యువకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.మొదట కృపా కాంప్లెక్స్‌లో వరసిద్ధి వినాయక ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మైనంపల్లి హనుమంతరావు సందర్శించారు. ఆర్గనైజర్లు పిట్టల సాయికిరణ్, టీఎన్ఎస్ఎఫ్ సాయి, సతీష్ యాదవ్, వెంకట్ గౌడ్, భరత్ పటేల్, పరమేష్, చందు గుప్తా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అనంతరం కృపా కాంప్లెక్స్‌లోని శ్రీనివాస్ అపార్ట్‌మెంట్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కిరాణా దుకాణాన్ని మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు. వ్యాపార రంగంలో నూతనంగా అడుగుపెట్టిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక ప్రజలకు అవసరమైన వస్తువులు అందుబాటులో ఉండేలా నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు సామ్యూల్ జాన్, శివకుమారి, రిపోర్టర్ ప్రియాంక, జయరావు తదితరులు పాల్గొన్నారు.తదుపరి ఓల్డ్ సఫిల్‌గూడలో బర్ల నరేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మైనంపల్లి హనుమంతరావు సందర్శించారు. వినాయక విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఉత్సవాలు ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగాలని ఆకాంక్షించారు. గణేశ్ ఉత్సవాలు ప్రజలను ఐక్యంగా నిలిపే ఆధ్యాత్మిక, సామాజిక వేదుకలని పేర్కొంటూ, మండపాల నిర్వాహకులు



నిబంధనలు పాటిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ వై. ప్రేమకుమార్, పిట్టల శ్రీనివాస్, బీ-బ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బీకే శ్రీనివాస్, గుండా నిరంజన్, జీఎన్‌వీ సతీష్‌కుమార్, పిట్టల నాగరాజు, ఎస్ఆర్ ప్రసాద్, రాందాస్, సంతోష్ ముదిరాజ్, శ్రీకాంత్ ముదిరాజ్, సురేష్ సింగ్, పార్థసారథి, వినోద్ యాదవ్, జీడి సంపత్ గౌడ్, యూసుఫ్ భాయ్, సత్యమూర్తి, ఆశ, మంద భాస్కర్, బాల్‌రాజ్ యాదవ్, గడప దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# రామవరం రెవెన్యూ పరిధిలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

- నెలన్నరలోగా రీ-సర్వే పనులు పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్
- పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూముల హద్దులను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలి.

**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబరు 23 (జర్నలిస్ట్ ఫైల్) :** కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సుజాతనగర్–రామవరం–గరీబ్‌పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఇప్పటికే గ్రామ సరిహద్దుల నిర్ధారణతో పాటు అటవీ భూముల హద్దుల పరిశీలన చేపట్టినట్లు తెలిపారు. సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల అటవీ భూమి ఉన్నట్లు వెల్లడించారు.సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 20లో పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూములు కలిసివున్నందున రికార్డుల ఆధారంగా ఆయా భూముల హద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు. ఇప్పటికే అటవీ భూముల హద్దులు నిర్ధారించిన ప్రాంతాల్లో ఎలాంటి జాప్యం లేకుండా మిగిలిన రీ-సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.సర్వే పరిధిలో పోడు సాగు భూములు ఉన్నాయని, అర్హులైన వారికి ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద హక్కులు కల్పించినట్లు అధికారులు తెలిపారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని, వారిలో గిరిజనులు, ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు వివరించారు. రీ-సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమయ్యేలా, హక్కుదారులకు ప్రయోజనం కలిగే విధంగా భూ రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో ఉన్న పాత సరిహద్దు రాళ్లు,



మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు.రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా వేగవంతం చేసి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేయాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావు లేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నతనంలోనే కండరాల క్షీణత గుర్తింపుపై ప్రత్యేక దృష్టి



**○ అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం: మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ శోభారాణి సుంకర సచివాలయంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి సెప్టెంబర్ 30న మంగళగిరిలో నిర్వహించనున్న 'సాహస్-2026' కార్యక్రమానికి ఆహ్వానించారు. మస్క్యులర్ డిస్ట్రోఫీ బాధితులకు ఈ కార్యక్రమంలో 130 ఎలక్ట్రిక్ వీల్‌చైర్లు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

స్వయంగా దివ్యాంగురాలైనప్పటికీ కండరాల క్షీణత బాధితులకు అండగా నిలుస్తూ శోభారాణి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమని మంత్రి దుర్గేష్ ప్రశంసించారు. చిన్నతనంలోనే వ్యాధి లక్షణాలను గుర్తిస్తే తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు సమన్వయంతో పనిచేస్తే ఈ సమస్యను సమర్థంగా ఎదుర్కోవచ్చని అన్నారు.

అమరావతి రేర్ డిసీజెస్ ఆర్గనైజేషన్ ద్వారా శోభారాణి చేస్తున్న సేవలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, తాను పరిశీలించినట్లు దుర్గేష్ తెలిపారు. సమాజంలోని బలహీన వర్గాల కోసం ఆమె చేస్తున్న సేవలు మరింత సత్ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## వీరబ్రహ్మేంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):**జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వాములవారి మఠం నందు ప్రతినెల శుద్ధద్వాదశి రోజున మాస కల్యాణ మహోత్సవం నిర్వహించబడుతుంది. ఆ కళ్యాణ మహోత్సవాలలో భాగంగా 23.09.2026 తేదీ బుధవారం రోజున భాద్రపద శుద్ధ ద్వాదశి మాస కళ్యాణ మహోత్సవం మఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వీర ధర్మజ వేంకటాద్రి స్వాముల వారు ఆశీస్సులతో కళ్యాణ మహోత్సవం నిర్వహించారు.

ఈ కళ్యాణ మహోత్సవంలో మఠాధిపతుల సోదరులు దత్తాత్రేయ స్వామి, భక్తులు ,పుర ప్రజలు, మీడియా మిత్రులు, అధ్వర్యులు , అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొనడం జరిగింది. తదుపరి ఈ కళ్యాణ మహోత్సవం తిలకించిన భక్తాదులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి



**○ గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌చార్జిలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. వర్షాలు, వరదల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు సహాయం అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు.

లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలని, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నప్పుడు ప్రజలు వాటిని దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, తెగిపడిన విద్యుత్ తీగలు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని సూచించారు.

అత్యవసర పరిస్థితుల్లో గుంటూరు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 8688831595, జిల్లా కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 0863-2234014కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

## స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యత



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):**స్వచ్ఛత అనేది ప్రభుత్వ శాఖలు, సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ఎంపీడీవో రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం బ్రహ్మంగారిమఠంలో జరిగిన స్వచ్ఛతాహి మరియు స్వచ్ఛ పదం కార్యక్రమంలో ఎంపీడీవో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో తమ పరిసరాలను ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో శానిటేషన్ నీటి వనరుల శుభ్రత తడిచెత్త పొడిచెత్త వ్యక్తిగత మరుగుదొడ్లు ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు చెట్లను పెంచుదాం కాలుష్యాన్ని నివారిద్దాం ప్రజల భాగస్వామ్యం తదితర వాటి పై ప్రజలకు అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని పంచాయతీల్లో కూడా స్వచ్ఛతాహి స్వచ్ఛ పదం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పై కార్యక్రమాల్లో మండల పరిషత్ పరిపాలన అధికారి నరసయ్య ఆర్డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ పంచాయతీ అభివృద్ధి అధికారులు మండల పరిషత్ ఆర్డబ్ల్యూఎస్ సచివాలయ ఉద్యోగులు సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## వైసీపీ అరాచకాలకు తావులేదు : ఎమ్మెల్యే గల్లా మాధవి

**○ 83 మంది లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

**○ స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలి**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం కావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి పిలుపునిచ్చారు. ఎన్నికల్లో అలజడులు సృష్టించి రాజకీయ లబ్ధి పొందాలని వైసీపీ ప్రయత్నిస్తున్నప్పటికీ వారి ఆటలు సాగవని అన్నారు.

బుధవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ క్యాలెండర్ సమావేశంలో డివిజన్ పార్టీ అధ్యక్షులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. అనంతరం నిర్వహించిన పార్టీ నేతల గ్రీవెన్స్ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. వినతులను పరిశీలించి వాటి పరిష్కారానికి సంబంధిత నాయకులు, అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా గల్లా మాధవి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో బూత్ స్థాయి నుంచి ప్రతి నాయకుడు, కార్యకర్త అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

విజయవాడలో ఉపాధ్యాయులపై వైసీపీ ప్రభుత్వం చేపట్టిన దమనకాండను ఖండిస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు.

**83 మంది లబ్ధిదారులకు రూ.1.34 కోట్ల సీఎంఆర్ఎఫ్ చెక్కులు**

అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గల్లా మాధవి 83 మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మొత్తం రూ. 1,34,78,692 విలువైన చెక్కులను అందజేశారు.

ఇప్పటివరకు గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో 767 మంది లబ్ధిదారులకు రూ. 10,60,30,615 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని గల్లా మాధవి తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్థికంగా అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

**○ ఇంజినీరింగ్ అధికారులకు జీఎంసీ కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశాలు**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** 15వ ఆర్థిక సంఘం నిధులతో నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. టెండర్ పూర్తయినా ప్రారంభం కాని పనులను రద్దు చేసి రీ-టెండర్ నిర్వహించాలని, స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని సూచించారు.

ప్రధాన డ్రైన్లలో పూడికతీత పనులను తనిఖీ చేసి అవసరమైన చోట పూర్తి చేయాలని, కల్వర్టుల వద్ద పనులను జాగ్రత్తగా నిర్వహించాలని ఆదేశించారు. నగరంలో ఎక్కడా గుంతలు లేకుండా వెంటనే మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో కలుషిత నీరు రాకుండా పర్యవేక్షించాలని తెలిపారు. నీటి సరఫరా సమయంలో ఈఎల్ఎస్ఆర్‌లు, ఇళ్ల వద్ద 100 శాతం నీటి నమూనాలు సేకరించాలని, వాటర్ మీటర్ రీడింగ్‌లు తప్పనిసరిగా నమోదు చేసి అవసరమైన చోట కొత్త మీటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

నగరంలో చేపట్టనున్న పార్కులు, పబ్లిక్ టాయిలెట్ల అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి అక్టోబర్ చివరి నాటికి పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు.

ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిర్దేశిత సమయంలో పరిష్కరించి, సమస్య పరిష్కారానికి ముందు, తర్వాత ఫొటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. పత్రికల్లో వచ్చే ప్రజా సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ జి. వెంకటేశ్వరరావు, ఈఈలు, డీఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ పొలంలో పంట కాలువ పూడ్చివేతపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

**○ సర్వే నంబర్ 423లో దొంగ రికార్డులు సృష్టించి ఆక్రమణలకు పాల్పడిన వారిపై సమగ్ర విచారణ జరపాలి**

**○ సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్**



**బ్రహ్మంగారిమఠం (జర్నలిస్ట్ ఫైల్):** బ్రహ్మంగారిమఠం మండలంలోనినాగిశెట్టిపల్లె రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు పంట కాలువలు మరియు ప్రజా ప్రయోజనానికి సంబంధించిన భూములను పరిరక్షించడంలో రెవెన్యూ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ మండల కార్యదర్శి పెద్దుల్లపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు.

నాగిశెట్టిపల్లె రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 560లో ఉన్న పంట కాలువను కొందరు వ్యక్తులు ఎలాంటి అనుమతులు లేకుండా పూడ్చివేసి చదును చేసినట్లు వస్తున్న ఆరోపణలపై అధికారులు తక్షణమే స్థల పరిశీలన నిర్వహించాలని ఆయన కోరారు. పంట కాలువలు రైతుల సాగునీటి అవసరాలకు అత్యంత కీలకమైనవని, వాటిని పూడ్చివేయడం వల్ల వర్షాకాలంలో నీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడి పంట పొలాలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు.

ప్రభుత్వ రికార్డుల్లో కాలువగా నమోదై ఉన్న భూమిని వ్యక్తిగత అవసరాల కోసం పూడ్చివేసి చదును చేసి ఉంటే, అది నిబంధనలకు విరుద్ధమా కాదా అనే విషయాన్ని అధికారులు రికార్డులు రెవెన్యూ మ్యాపులు ఫీల్డ్ మెజర్‌మెంట్ ఆధారంగా నిర్ధారించాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించినట్లు నిర్ధారణ అయితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే క్రిమినల్ కేసు నమోదు చేసి పూడ్చివేసిన కాలువను తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

అదేవిధంగా సర్వే నంబర్ 423కు సంబంధించి తప్పుడు లేదా అక్రమ రికార్డులు సృష్టించి భూమిని ఆక్రమించుకున్నారనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని ప్రభాకర్ కోరారు. ఈ భూమికి సంబంధించిన పాత రెవెన్యూ రికార్డులు అడంగల్ 1-బి రీసర్వే రికార్డులు, ఎఫ్ఎంబీ పట్టాదారు పాస్‌బుక్ వివరాలు,రిజిస్ట్రేషన్ పత్రాలు తదితరాలను పరిశీలించి అసలు హక్కుదారులు ఎవరు, భూమి స్వభావం ఏమిటి, రికార్డుల్లో మార్పులు ఎప్పుడు జరిగాయి అనే అంశాలను స్పష్టంగా తేల్చాలని అన్నారు.

భూ రికార్డుల్లో అక్రమ మార్పులు జరిగి ఉంటే వాటికి బాధ్యులైన వ్యక్తులతో పాటు, అక్రమంగా రికార్డులు సృష్టించడంలో ఎవరైనా అధికారుల ప్రమేయం ఉందా అనే అంశాన్ని కూడా విచారించాలని డిమాండ్ చేశారు. నకిలీ పత్రాలు లేదా తప్పుడు రికార్డుల ఆధారంగా భూమిని ఆక్రమించారని సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఈ వ్యవహారంపై తహసీల్దార్ వెంటనే స్పందించి ప్రత్యేక బృందంతో స్థల పరిశీలన చేయాలి. సర్వే నంబర్లు 560, 423కు సంబంధించిన పూర్తి రెవెన్యూ రికార్డులను పరిశీలించి ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుడిమె సురేష్ సుజన్ లు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి

**○ పీఎఫ్, ఈఎస్ఐ చెల్లింపుల్లో పారదర్శకత కల్పించాలి**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న సుమారు 8,600 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు డిమాండ్ చేశారు. జీతాల ఆలస్యంతో కార్మికులు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్యం, రుణాల చెల్లింపుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

జీతాల నుంచి మినహాయిస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ మొత్తాలను సకాలంలో సంబంధిత ఖాతాల్లో జమ చేసేలా ఆర్టీసీ యాజమాన్యం పర్యవేక్షించాలని కోరారు. ఎన్టీఆర్, తిరుపతి జిల్లాల్లో పైలట్‌గా అమలు చేసిన సాఫ్ట్‌వేర్ ఆధారిత పీఎఫ్, ఈఎస్ఐ పర్యవేక్షణ విధానాన్ని సమీక్షించి, లోపాలను సరిదిద్ది రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుడు తన పీఎఫ్, ఈఎస్ఐ వివరాలను ఆన్‌లైన్‌లో స్వయంగా పరిశీలించుకునేలా సదుపాయం కల్పించాలని కోరారు. మినహాయించిన మొత్తం, జమ చేసిన తేదీ, పీఎఫ్ యూఏఎన్, ఈఎస్ఐ వివరాలు అందుబాటులో ఉంచాలని, దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

## డ్రగ్స్ రహిత భారతావని కోసం సమగ్ర కార్యాచరణ

**○ జాతీయ సదస్సులో ఏపీ ఈగల్ కార్యక్రమాలు, విజయాలను వివరించిన ఐజీపీ ఆకే రవికృష్ణ**



**న్యూఢిల్లీ/అమరావతి(జర్నలిస్ట్ ఫైల్):** మాదకద్రవ్యాల నియంత్రణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో మిషన్ మోడ్‌లో పనిచేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలో జరిగిన 3వ జాతీయ యాంటీ నార్కోటిక్స్ టాస్క్‌ఫోర్స్ చీఫ్స్ సదస్సులో ఏపీ ఈగల్ చీఫ్, ఐజీపీ ఆకే రవికృష్ణ పాల్గొని రాష్ట్రంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

రాష్ట్రంలో 40,000 ఈగల్ క్లబ్‌ల ద్వారా 74,000 అవగాహన కార్యక్రమాలు నిర్వహించి సుమారు 20 లక్షల మంది విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. 'బ్రేక్ ది సైలెన్స్-కాల్ 1972' ప్రచారం ద్వారా ప్రజలు మాదకద్రవ్యాల సమాచారాన్ని హెల్ప్‌లైన్‌కు అందించేలా చర్యలు చేపట్టినట్లు చెప్పారు. 1,928 కేసుల్లో 91,840 కిలోల గంజాయి, ఇతర మాదకద్రవ్యాలను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు.

'ఆపరేషన్ గరుడ', 'వజ్రప్రహార్', 'సేఫ్ క్యాంపస్ జోన్' ద్వారా మెడికల్ షాపులు, విద్యాసంస్థల పరిసరాలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గంజాయి సాగు నిర్మూలనకు డ్రోన్ సర్వైలెన్స్, శాటిలైట్ ఇన్‌పుట్స్, జీఐఎస్ మ్యాపింగ్, సోషల్ మీడియా మానిటరింగ్, కే9 బృందాలను వినియోగిస్తున్నట్లు వివరించారు. ఏపీ ఈగల్ మోడల్‌ను ఇతర రాష్ట్రాల అధికారులు ప్రశంసించినట్లు పేర్కొన్నారు.

2026--29లో గంజాయి సాగు నిర్మూలన, డ్రగ్స్ కింగ్‌పిన్లు-సరఫరా నెట్‌వర్క్‌లపై చర్యలు, యువతలో డిమాండ్ తగ్గింపు, బాధితులకు చికిత్స--పునరావాసం, ప్రజల భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రధాన లక్ష్యాలని ఆకే రవికృష్ణ తెలిపారు. ఏపీ ఈగల్‌ను 27 కార్యాచరణ విభాగాలతో మరింత సమర్థవంతంగా పునర్వ్యవస్థీకరించే ప్రతిపాదన ఉందని చెప్పారు.

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



**○ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

**○ అత్యవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలి**

**○ జిల్లా కలెక్టర్ సాయికాంత్ వర్మ**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** అల్పపీడనం ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సి.ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. అన్ని మండల కేంద్రాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసి అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించినట్లు చెప్పారు.

రానున్న 24 గంటల్లో జిల్లాలో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపుల సమయంలో చెట్లు, విద్యుత్ స్తంభాలు, హోర్డింగులు, బలహీనమైన నిర్మాణాల కింద ఆశ్రయం పొందరాదని సూచించారు.

అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని, వాగులు, కాలువలు, నీటి వనరులకు దూరంగా ఉండాలని కలెక్టర్ కోరారు. రైతులు పంటలు, వ్యవసాయ పరికరాలను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలని, పరిస్థితులు తీవ్రతరమైతే అధికారులు సూచించిన సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షాలు, వరదలు, నీటి ముంపు, చెట్లు లేదా విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూమ్ 0863-2234014ను సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం, జిల్లా యంత్రాంగం సూచనలను మాత్రమే పాటించాలని కోరారు.

## రోడ్లపై పశువులను వదిలితే గోశాలకు తరలింపు

**○ యజమానులపై పోలీసు కేసులు నమోదు చేస్తాం: జీఎంసీ కమిషనర్**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** గుంటూరు నగరంలో ఆవులు, ఎద్దులు, ఇతర పశువులను రోడ్లపైకి వదలకుండా యజమానులు ఇళ్ల వద్దే ఉంచుకోవాలని నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ సూచించారు. రోడ్లపై పశువులు సంచరించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం, ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో రోడ్లపై తిరిగే పశువులను ప్రత్యేక వాహనాలతో పట్టుకుని జీఎంసీ గోశాలకు తరలిస్తామని తెలిపారు.

రోడ్లపై పశువులను వదిలే యజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు, వాటి కారణంగా ప్రమాదాలు జరిగితే యజమానులనే బాధ్యులుగా చేసి పోలీసు కేసులు నమోదు చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.

పట్టుకున్న పశువులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరిగి యజమానులకు అప్పగించబోమని స్పష్టం చేశారు. ప్రజల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ దృష్ట్యా పశువుల యజమానులు నిబంధనలు పాటించి వాటిని రోడ్లపైకి వదలకుండా సహకరించాలని కోరారు.

## వివిఐటీలో 'లింక్డ్ఇన్ లెర్నింగ్' ప్రారంభం



**○ విద్యార్థులకు ప్రపంచస్థాయి సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ**

**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** విద్యార్థులకు ఆధునిక సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను అందించే లక్ష్యంతో ప్రముఖ ప్రొఫెషనల్ నెట్‌వర్కింగ్, ఈ-లెర్నింగ్ వేదిక లింక్డ్ఇన్ లెర్నింగ్‌తో వివిఐటీ విశ్వవిద్యాలయం కీలక భాగస్వామ్యాన్ని కుదుర్చుకున్నట్లు వివిఐటీ ప్రొ-ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు.

వివిఐటీలో నిర్వహించిన కోర్సుల ప్రారంభ కార్యక్రమంలో లింక్డ్ఇన్ సౌత్ అండ్ వెస్ట్ రీజినల్ హెడ్ చింతా కృష్ణారెడ్డి, సౌత్ రీజినల్ అకౌంట్ డైరెక్టర్ సాక్షి రహేజా, ఐయుసిఈఈ వ్యవస్థాపకుడు ప్రొఫెసర్ కృష్ణ వేదుల, వివిఐటీ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వాసిరెడ్డి మహదేవ్ మాట్లాడుతూ భాగస్వామ్యం ద్వారా వివిఐటీ విద్యార్థులు, అధ్యాపకులు లింక్డ్ఇన్ లెర్నింగ్‌లోని వేలాది సర్టిఫైడ్ కోర్సులను ఉచితంగా అభ్యసించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ తదితర రంగాల్లో అంతర్జాతీయ నిపుణులు రూపొందించిన కోర్సులు అందుబాటులో ఉంటాయని వివరించారు.

విద్యార్థులు పూర్తి చేసిన ప్రతి కోర్సుకు గుర్తింపు పొందిన సర్టిఫికెట్ లభిస్తుందని, తద్వారా వారి విద్యా, వృత్తిపరమైన ప్రొఫైల్‌కు అదనపు బలం చేకూరుతుందని పేర్కొన్నారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం ద్వారా విద్యార్థులకు బహుళజాతీయ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.

కార్యక్రమంలో వివిఐటీ రిజిస్ట్రార్ డా. వై. మల్లికార్జునరెడ్డి, కార్పొరేట్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ డైరెక్టర్ మామిళ్లపల్లి శ్రీకృష్ణ, లింక్డ్ఇన్ లెర్నింగ్ సెంటర్ సమన్వయకర్త డా. నూతలపాటి అశోక్, అధ్యాపకులు పాల్గొన్నారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## బాల్ బ్యాడ్మింటన్ రాణిస్తున్న బీసీ విద్యార్థికి మంత్రి సవిత అభినందనలు



**తాడేపల్లి/అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... ఏపీ నుంచి జాతీయ పోటీలకు ఎంపికైన వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థి దేవళ్ల సాయికుమార్ ను రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖామాత్యులు ఎస్.సవిత అభినందించారు. బాల్ బ్యాడ్మింటన్ లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కూడా రాణించి రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను వినుకొండ ఎంజేపీ బీసీ గురుకుల విద్యార్థి, బ్యాడ్మింటెన్ క్రీడాకారుడు సాయికుమార్, కోచ్ జూనా నాయక్, ప్రిన్సిపాల్ వై.రమేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9-13 తేదీల్లో మర్కాపురంలో జరిగిన 11వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బెస్ట్ ప్లేయర్ అవార్డుతో పాటు థర్డ్ ప్లేస్ సాధించి... జాతీయ పోటీలకు ఎంపికైనట్లు మంత్రి సవితకు సాయికుమార్ తెలిపాడు. వచ్చే నెల మూడో తేదీ నుంచి చత్తీస్ ఘడ్ లో జరిగే జాతీయ సబ్ జూనియర్స్ పోటీల్లో ఏపీ తరఫున పాల్గొనబోతున్నట్లు వివరించాడు. బాల్ బ్యాడ్మింటన్ లో రాణిస్తున్న బీసీ విద్యార్థి సాయికుమార్ ను మంత్రి సవిత కొత్త దుస్తులు అందజేసి, అభినందించి సత్కరించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించింది... రాష్ట్రానికి, దేశానికి పేరుప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు. బాల్ బ్యాడ్మింటన్ క్రీడలో సాయికుమార్ కు మెళకువులు నేర్పిన కోచ్ జూనా నాయక్ ను, ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వై.రమేశ్ ను కూడా మంత్రి సవిత అభినందించారు.

## స్పోర్ట్స్ టీచర్లపై దాడి హేయమైన చర్య

○ **ఎంఎస్‌పీటీఏ ఖండన**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** శాప్ కార్యాలయం వద్ద స్పోర్ట్స్ కోటాలో నియమితులైన ఉపాధ్యాయులను దుర్భాషలాడడం, వారిపై దాడికి పాల్పడడం హేయమైన చర్య అని మోడల్ స్కూల్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోసియేషన్ (ఎంఎస్‌పీటీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ షఫీ అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.

శాంతియుతంగా మద్దతు ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను అసభ్యకరంగా దూషించడం, వారిపై దాడి చేయడం ఉపాధ్యాయ వర్గాన్ని అవమానించడమేనని పేర్కొన్నారు. తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉపాధ్యాయులకు ఉందని తెలిపారు.

ఉపాధ్యాయులపై దాడులకు పాల్పడే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించరాదని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఘటనను ప్రతి ఉపాధ్యాయుడు, విద్యావేత్తలు, సమాజంలోని అన్ని వర్గాలు ఖండించాలని ఎంఎస్‌పీటీఏ నాయకులు పిలుపునిచ్చారు.

## స్వర్ణ భారతి ట్రస్ట్ సేవలను యువత సద్వినియోగం చేసుకోవాలి



○ **స్వర్ణ భారతీ ట్రస్ట్ సేవలు రాష్ట్రానికి గర్వకారణం**

**ఆత్కూరు(గన్నవరం)(జర్నలిస్ట్ ఫైల్):**

స్వర్ణ భారతి ట్రస్టు ద్వారా యువత వివిధ రకాల నైపుణ్యాలను అలవర్చుకొని ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు పేర్కొన్నారు. ఆత్కూరులోని స్వర్ణ భారతి ట్రస్ట్ ను బుధవారం సురేష్ బాబు సందర్శించి అక్కడ యువతకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలను గురించి అడిగి తెలుసుకున్నారు. అక్కడి విద్యార్థులతో మాట్లాడి వారికి అనేక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ స్వర్ణ భారతి ట్రస్ట్ ద్వారా అనేక రకాల ఆధునిక సౌకర్యాలతో యువతకు అందుతున్న శిక్షణ కార్యక్రమాలు ప్రశంసనీయమని అన్నారు. శిక్షణ పూర్తి అయ్యాక యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కూడా అందుతున్నాయన్నారు. భవిష్యత్తులో సాఫ్ట్వేర్,ఇతర రంగాల కంటే వివిధ రకాల చేతి వృత్తుల వారికే అత్యుత్తమ ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు.

యువత నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని అన్నారు. స్వర్ణ భారతి ట్రస్ట్ సేవలు రాష్ట్రానికి గర్వకారణమని తెలిపారు. ట్రస్టులో అందుతున్న నైపుణ్య శిక్షణా తరగతులను యువత సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. ట్రస్ట్ లో అందుతున్న సేవలు గురించి యువతకు అవగాహన కల్పించాలన్నారు. స్వర్ణ భారతీ ట్రస్ట్ ఏర్పాటు, అభివృద్ధిలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు కృషి,పట్టుదల స్ఫూర్తిదాయకమన్నారు.

ట్రస్ట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పరదేశి తో సురేష్ బాబు పలు అంశాలపై మాట్లాడారు. సురేష్ బాబుతో పాటు తొంమ్మంద్రు పండు తదితరులు ఉన్నారు.

## మూగబోనున్న 104 ఆరోగ్య రథాలు!

○ **అక్టోబర్ 12 నుంచి సమ్మెకు 104 ఉద్యోగుల హెచ్చరిక**

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** 104 మొబైల్ మెడికల్ యూనిట్ల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే అక్టోబర్ 12, 2026 నుంచి విధులు బహిష్కరించి సమ్మె చేపడతామని 104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షుడు ఏ.వి. నాగేశ్వరరావు తెలిపారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందజేసినట్లు పేర్కొన్నారు.

18 సంవత్సరాలుగా సేవలందిస్తున్న ఉద్యోగులను అక్రమంగా తొలగించడం, వేధింపులు, సస్పెన్షన్ ఆదేశాలను రద్దు చేసి తిరిగి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 104 సేవలను ప్రభుత్వమే నేరుగా నిర్వహించి ఉద్యోగ భద్రత కల్పించాలని, న్యాయమైన వేతనాలతో పాటు ఉద్యోగ భవిష్య నిధి, ఉద్యోగుల రాజ్య బీమా, సెలవులు, ఆరోగ్య భద్రత వంటి చట్టబద్ధ సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమస్యలను ప్రజారోగ్య సమస్యగా పరిగణించి వెంటనే చర్చలు జరిపి పరిష్కరించాలని, లేకుంటే అక్టోబర్ 12 నుంచి సమ్మె తప్పదని స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

**రూ.22,177 కోట్ల పెట్టుబడులకు ఆమోదం :** వివిధ రంగాల్లో రూ.22,177.84 కోట్ల పెట్టుబడులకు సంబంధించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటి ద్వారా 19,739 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మౌలిక వసతులు, ఇంధనం, పరిశ్రమలు, ఆహార శుద్ధి, ఐటీ-ఎలక్ట్రానిక్స్, పర్యాటక రంగాల్లో ఈ పెట్టుబడులు రానున్నాయి.

మచిలీపట్నం పోర్టులో గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.8,000 కోట్ల పెట్టుబడితో నౌకానిర్మాణం, నౌకా మరమ్మతుల కేంద్రం ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. 400 ఎకరాల వాటర్‌ఫ్రంట్ భూమిలో ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నారు. 5-8 సంవత్సరాల్లో సుమారు 8,000 ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రతిపాదనలో పేర్కొన్నారు.

పల్నాడు జిల్లా దాచేపల్లి మండలం గమలపాడులో మై హోమ్ ఇండస్ట్రీస్ గ్రీన్‌ఫీల్డ్ సిమెంట్ కర్మాగారం, తిరుపతి జిల్లాలో క్యాటర్‌పిల్లర్ ఇండియా గ్రీన్‌ఫీల్డ్ సదుపాయం, కుప్పంలో ఎంఏఎఫ్ క్లాతింగ్ గార్మెంట్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా ఆమోదం లభించింది.

**అమరావతికి రూ.1,548.98 కోట్ల మౌలిక వసతులు :** అమరావతి రాజధాని నగర పరిధిలోని గ్రామ పంచాయతీల్లో నీటి సరఫరా, సీవరేజ్, స్టార్మ్ వాటర్ నెట్‌వర్క్, రహదారులు, స్ట్రీట్‌లైట్ల వంటి మౌలిక వసతుల అభివృద్ధికి రూ.1,548.98 కోట్ల సవరించిన పరిపాలనా



అనుమతిని కేబినెట్ మంజూరు చేసింది.

అమరావతి ప్రభుత్వ సముదాయంలోని సూపర్ బ్లాక్ 'ఈ'లో శాసనసభ భవన నిర్మాణానికి రూ.661 కోట్ల పరిపాలనా అనుమతికి కూడా ఆమోదం తెలిపింది.

**ఉద్యోగులు, పింఛనర్లకు రెండు విడతల డీఏ :** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనర్లకు 2024 జూలై 1 నుంచి 2.73 శాతం, 2025 జనవరి 1 నుంచి 1.82 శాతం చొప్పున డీఏ, డీఆర్ మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. సెప్టెంబరు 2026 జీతం నుంచి నగదు ప్రయోజనం అమల్లోకి రానుంది.

2024 జూలై నుంచి రావాల్సిన డీఏ బకాయిల్లో 10 శాతాన్ని 2027 ఏప్రిల్‌లో, మిగిలిన 90 శాతాన్ని 2027 జూన్, ఆగస్టు, అక్టోబరులో చెల్లించనున్నారు. 2025 జనవరి నుంచి రావాల్సిన బకాయిల్లో 10 శాతాన్ని 2028 జనవరిలో, మిగిలిన మొత్తాన్ని 2028 మార్చి, మే, జూలైలో చెల్లించనున్నారు. మొత్తం ఆర్థిక భారం సుమారు రూ.4,556 కోట్లుగా ఉండనుంది.

**నాలుగు కొత్త కమిషనరేట్లు :** గుంటూరు, తిరుపతి, కర్నూలు, రాజమహేంద్రవరం కేంద్రాలుగా నాలుగు కొత్త పోలీస్ కమిషనరేట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

గుంటూరు కమిషనరేట్ పరిధిలో గుంటూరు, గుంటూరు రూరల్, అమరావతి క్యాపిటల్ రీజియన్, తెనాలి నాలుగు జోన్లు ఉంటాయి. తిరుపతి కమిషనరేట్‌లో తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, శ్రీ సిటీ జోన్లు ఏర్పాటు చేయనున్నారు.

కర్నూలు కమిషనరేట్‌లో రెండు జోన్లతో పాటు కర్నూలు అర్బన్, కర్నూలు రూరల్, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ సబ్ డివిజన్లు ఉండనున్నాయి. రాజమహేంద్రవరం కమిషనరేట్‌ను మూడు టెరిటోరియల్ జోన్లతో ఏర్పాటు చేయనున్నారు.

**ప్రాసిక్యూషన్ సర్వీస్‌లో మార్పులు :** భారతీయ నాగరిక సురక్షా సంహితకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ ప్రాసిక్యూషన్ సర్వీస్ రూల్స్--2026 ముసాయిదాకు కేబినెట్ ఆమోదం తెలిపింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టుల్లో 30 శాతం ప్రత్యక్ష నియామకం, 70 శాతం పదోన్నతి ద్వారా, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులను 100 శాతం ప్రత్యక్ష నియామకం ద్వారా భర్తీ చేసే విధానాన్ని ప్రతిపాదించారు.

**క్లీన్ ఎనర్జీ ప్రాజెక్టులకు ఆమోదం :** సౌర, పవన, హైబ్రిడ్ విద్యుత్ ప్రాజెక్టులు, కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టులకు కేబినెట్ పలు అనుమతులు ఇచ్చింది. శ్రీసత్యసాయి జిల్లాలో 675 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు, వైఎస్సార్ కడప, కర్నూలు జిల్లాల్లో సోలార్-విండ్ హైబ్రిడ్ ప్రాజెక్టులు, నంద్యాల జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్రాజెక్టుకు ఆమోదం లభించింది.

**న్యాయాధికారుల పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు :** న్యాయాధికారుల పదవీ విరమణ వయసును 61 నుంచి 62 సంవత్సరాలకు పెంచేందుకు, 2026 మార్చి 31 నుంచి అమల్లోకి వచ్చేలా ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది.

**సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ల పాలసీకి ఆమోదం :** ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశ్వసనీయ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను గుర్తించి, ధ్రువీకరించి, ఎంప్యానెల్ చేసే విధంగా ఆంధ్రప్రదేశ్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ పాలసీకి కేబినెట్ ఆమోదం తెలిపింది.

ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ఎక్స్ వేదికలపై కంటెంట్ రూపొందించే వారికి ఈ విధానం వర్తించనుంది. ప్రారంభంగా ఏడాది పాటు పాలసీ అమల్లో ఉండి, పనితీరు ఆధారంగా మరో రెండేళ్ల వరకు పొడిగించే అవకాశం ఉంటుంది.

హంద్రీ-నీవా సుజల స్రవంతి, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పర్యాటక ప్రాజెక్టులు, క్వాంటమ్ టెక్నాలజీ, ఐటీ-ఐటీఈఎస్ రంగాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది.

## స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమాయత్తం కావాలి

○ **వేమూరు నియోజకవర్గ క్యాడర్ క్యాలెండర్ సమావేశంలో నక్కా ఆనందబాబు**



**వేమూరు(జర్నలిస్ట్ ఫైల్):** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తెలుగుదేశం పార్టీ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తం కావాలని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. వేమూరులోని లక్ష్మీ పద్మావతి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన సెప్టెంబర్--2026 క్యాడర్ క్యాలెండర్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, సీయూబీ ఇన్‌ఛార్జ్‌లు, మండల, గ్రామస్థాయి పార్టీ బాధ్యులు సమావేశంలో పాల్గొన్నారు. క్యాడర్ క్యాలెండర్‌లో నిర్దేశించిన కార్యక్రమాల అమలు, పార్టీ సంస్థాగత వ్యవహారాలు, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై నక్కా ఆనందబాబు సమీక్ష నిర్వహించారు.

ప్రతి మండలం, గ్రామం, యూనిట్ స్థాయిలో పార్టీ కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలని, నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ సంస్థాగత వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి మండలం, గ్రామం, యూనిట్ స్థాయిలో పార్టీ పరిస్థితిని సమీక్షించుకోవాలని, ప్రతి పార్టీ బాధ్యుడు తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు.

సీయూబీ ఇన్‌ఛార్జ్‌లు తమ పరిధిలోని పార్టీ కార్యక్రమాలను సమన్వయం చేస్తూ గ్రామస్థాయి కార్యకర్తలతో నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని అన్నారు. క్యాడర్ క్యాలెండర్‌లో నిర్దేశించిన కార్యక్రమాలను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నిర్వహించడంతో పాటు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

వివిధ మండలాల పార్టీ నాయకులు తమ పరిధిలోని సంస్థాగత పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలు, క్యాడర్ క్యాలెండర్ అమలుకు సంబంధించిన అంశాలను సమావేశంలో వివరించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ సంస్థాగత వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని, ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణతో సమర్థవంతంగా నిర్వర్తించాలని నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. సమావేశంలో నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల పార్టీ బాధ్యులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, సీయూబీ ఇన్‌ఛార్జ్‌లు, పార్టీ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎన్ఆర్ఐ ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ప్రాంగణ నియామకాలు

○ **లుకాస్ టీవీఎస్‌లో 172 మంది విద్యార్థులకు ఉద్యోగాలు**

○ **రూ.4.1 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్):** మేడికొండూరు సమీపంలోని ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన ప్రాంగణ నియామక కార్యక్రమంలో ప్రముఖ సంస్థ లుకాస్ టీవీఎస్, చెన్నైకు 172 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులకు సంవత్సరానికి రూ.4.1 లక్షల వరకు వేతన ప్యాకేజీ అందించనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.

వివిధ ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన విద్యార్థులు ఈ నియామక ప్రక్రియలో ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థుల సాంకేతిక పరిజ్ఞానం, ప్రాయోగిక నైపుణ్యాలు, సంభాషణా సామర్థ్యం తదితర అంశాలను పరిశీలించి ఎంపిక ప్రక్రియ నిర్వహించినట్లు కళాశాల వర్గాలు తెలిపాయి.

విద్యార్థులకు ప్రాంగణంలోనే ప్రముఖ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఎన్ఆర్ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శిక్షణ, నియామక విభాగం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగ ఇంటర్వ్యూలకు సన్నద్ధత, వృత్తి మార్గదర్శకత్వం అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

172 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడంపై కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డా. శ్రీహరి, ప్రిన్సిపాల్ డోలా సంజయ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాధిపతి రాజేష్, శిక్షణ, నియామక సమన్వయకర్త జీవన, మౌలాలీ, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

నాణ్యమైన విద్యతో పాటు పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ, నైపుణ్యాభివృద్ధి, మెరుగైన ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై కళాశాల ప్రత్యేక దృష్టి సారిస్తోందని యాజమాన్యం వెల్లడించింది. 172 మంది విద్యార్థులు ఎంపిక కావడం, రూ.4.1 లక్షల వార్షిక వేతన ప్యాకేజీ లభించడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## 27న రాజమహేంద్రవరంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



○ **గోదావరి పుష్కరాలు, ఇన్‌బౌండ్ టూరిజంపై ప్రత్యేక కార్యాచరణ**

○ **రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలను రాజమహేంద్రవరంలో ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. సచివాలయంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన మంత్రి, రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు.

రానున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని టెంట్ సిటీలు, హోమ్‌స్టేలు తదితర వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రానికి ఇన్‌బౌండ్ టూరిస్టులను ఆకర్షించేందుకు కొత్త ప్యాకేజీలు, ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు రూపొందించాలని, దేశంలోని ప్రధాన నగరాలతో పాటు విదేశాల్లోనూ రోడ్‌షోలు నిర్వహించాలని సూచించారు.

కేంద్ర పథకాల కింద మంజూరైన నిధులతో చేపడుతున్న పర్యాటక పనుల ప్రగతిని మంత్రి సమీక్షించారు. మరిన్ని పర్యాటక ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించడం ద్వారా అదనపు నిధులు రాబట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఏడాదంతా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలు నిర్వహిస్తూ రాష్ట్రాన్ని ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడంతో పాటు స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు.

## టెక్కలి రైలు ప్రమాదంపై పీవీఎన్ మాధవ్ సంతాపం



**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీకాకుళం జిల్లా టెక్కలి సమీపంలో రైలు ఢీకొని నలుగురు విద్యార్థులు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదకరమని బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. విద్యార్థుల మృతిపై దిగ్భ్రాంతి, సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని మృతుల కుటుంబ సభ్యులకు భగవంతుడు ప్రసాదించాలని పీవీఎన్ మాధవ్ ప్రార్థించారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర కార్యాలయం నుంచి ప్రకటన విడుదలైంది.

# రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ





○ **మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు**

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** రెవెన్యూ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలు, పదోన్నతులు, సర్వీసు అంశాల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్న రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి చేబ్రోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నూతన కమిటీ సభ్యులు మంత్రిని సచివాలయంలో కలిసి సత్కరించారు.

జూన్ 20ను రెవెన్యూ డేగా ప్రకటించడం, 58 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లకు పదోన్నతులు, 2019 నుంచి 2024 వరకు డిప్యూటీ కలెక్టర్ల ప్యానళ్ల ఏర్పాటు, పెండింగ్ డిప్యూటీ తహసీల్దార్ ప్యానళ్లకు ఆమోదం వంటి చర్యలను అసోసియేషన్ నాయకులు అభినందించారు. 296 మంది డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతులు కల్పించడం, ఏసీబీ కేసుల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ఊరట కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ఉత్తర్వులు, అదనపు పింఛను పునరుద్ధరణ ఉత్తర్వులు విడుదల చేసినందుకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కూడా అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. ఉద్యోగులు, పింఛనర్లకు ఆర్థిక ప్రయోజనం కలిగించే నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ మంత్రిని ఘనంగా సత్కరించింది.

రెవెన్యూ శాఖలోని ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరిస్తున్న మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు, ఉద్యోగులు-పింఛనర్ల ఆర్థిక అంశాల పరిష్కారానికి చొరవ చూపుతున్న మంత్రి పయ్యావుల కేశవ్‌కు రాష్ట్రంలోని రెవెన్యూ ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు బొప్పరాజు వెంకటేశ్వర్లు, చేబ్రోలు కృష్ణమూర్తి తెలిపారు.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467